PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 345 | విజయవాడ, గురువారం 18 జులై 2024 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Thursday 18 July 2024 | Rs

నిరుద్యోగ భారతం
- రెండు వేల ఉద్యోగాలు.. 25 వేల మంది హాజరు
- ముంబయి ఎయిర్‌పోర్టులో తొక్కిసలాట

లోపలి పేజీలో..



రేపటి నుంచి మహిళల ఆసియాకప్
- తొలిమ్యాచ్‌లో పాక్‌తో హర్మన్‌ప్రీత్ సేన ఢీ

6

'మహా స్టీల్' ఏర్పాటు చేయండి

- దేశ భవిష్యత్తుకు అదే కీలకం
- స్టీల్ రక్షణ సెమినార్‌లో తపన్‌సేన్ డిమాండ్
- విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడం ఎవరి తరం కాదు : వక్తలు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశ భవిష్యత్తు పట్ల మోడీ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా ఉక్కు ఉత్పత్తి రంగంలోని ఐదు ప్రతిష్టాత్మక సంస్థలను విలీనం చేసి 'మహా స్టీల్'ను ఏర్పాటు చేయాలని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ డిమాండ్ చేశారు. ఉక్కు సంక్షోభం - అధిగమించడం ఎలా?' అనే అంశంపై బుధవారం సాయంత్రం ఉక్కు నగరంలోని ట్రైనింగ్ సెంటర్‌లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన సెమినార్ జరిగింది. ఈ సదస్సుకు సిఐటియు నాయకులు వైటి దాస్ అధ్యక్షత వహించారు. ముఖ్య వక్తగా హాజరైన తపన్‌సేన్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తుకు మహాస్టీల్‌ను ఏర్పాటు చేయడమే అత్యంత కీలకమని చెప్పారు.

ప్రధాని మోడీ చెప్పిన ఐదు ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం చేరుకోవాలన్నా, 2030 నాటికి 300 టన్నుల స్టీల్ ఉత్పత్తి కావాలన్నా ఆర్ఐఎన్ఎల్, నాగర్ నార్ స్టీల్, సెయిల్, ఎన్ఎండిసి, కర్ణాటక స్టీల్ సంస్థలను విలీనం చేసి 'మహాస్టీల్'ను ఏర్పాటు చేయడమే మార్గమని చెప్పారు. తాను చెబుతున్న లక్ష్యాల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కేంద్ర ప్రభుత్వం ఈ దిశలో చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌ను మాత్రమే కాకుండా 2021లో దేశంలోని 49 ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్రంలోని మోడీ సర్కారు అమ్మకానికి పెట్టిందని



సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జాతీయ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్

తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు రా మెటీరియల్, సొంత గనులు, బ్యాంకు రుణాలు ఇవ్వకుండా చంపెయ్యాలన్న కుట్ర కావాలనే జరిగిందని వివరించారు. 2021 నుంచి 1,265 రోజులుగా అప్రమత్తంగా ఉంటూ కార్మికులు ప్రయివేటీకరణ కాకుండా పోరాడుతున్నందుకు అభినందించారు. బెంగాల్‌లో ఇస్కో కంపెనీ ఆస్తుల విలువ రూ.లక్ష కోట్లు ఉంటే, కేవలం రూ.120 కోట్లకు మార్కెట్‌లో పెట్టి అమ్మేయాలని కేంద్రం చూసిందని, ఆ రాష్ట్ర ప్రజలు పోరాడి రూ.16 వేల కోట్లు ప్రభుత్వంతో పెట్టుబడి పెట్టించి ప్రయివేటీకరణ కుట్రను ఆపగలిగారని గుర్తు చేశారు. వైజాగ్ స్టీల్‌ప్లాంట్ సంక్షోభంలో లేదని తెలిపారు. 2001 నుంచి 2008 వరకూ జరిగిన ఉత్పత్తి వల్ల రూ.4 వేల కోట్ల అప్పులుపోయి రూ.8 వేల కోట్లు మిగుల్చుకుందని తెలిపారు.

కార్మికుల పోరాటం హర్షణీయం : శివసాగరేశ్వరరావు

ముఖ్య అతిథిగా హాజరైన స్టీల్ ప్లాంటు మాజీ సిఎండి శివ సాగరేశ్వరరావు మాట్లాడుతూ దేశ అవసరాలకు అవసరమైన 300 టన్నుల స్టీల్ ఉత్పత్తిలో స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, ఇతర రా మెటీరియల్ అందిస్తే వంద టన్నులు ఆర్ఐఎన్ఎల్‌లోనే ఉత్పత్తి అవుతుందన్నారు. మౌలిక వసతుల్లేకుండా స్టీల్ రంగం అభివృద్ధి కాదని తెలిపారు. 2021లో కేంద్రం వైజాగ్ మిగతా 5లో



కొనసాగుతున్న అల్పపీడనం

- రాష్ట్ర వ్యాప్తంగా నేడు, రేపు పలుచోట్ల భారీ వర్షాలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మధ్యప్రదేశ్ తీర ప్రాంతం మీదుగా అల్పపీడనం కొనసాగుతోందని, అనుబంధంగా ఆవర్తనం విస్తరించి ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి రోణంకి కూర్మనాథ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 18, 19 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నంద్యాల జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. రాయలసీమ, నెల్లూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. వర్షంతో పాటు ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, అత్యవసర సహాయం కోసం టోల్ ఫ్రీ నెంబర్లు 1070, 112, 18004250101ను సంప్రదించాలన్నారు. పొలాల్లో పనిచేసే రైతులు, వ్యవసాయ కూలీలు, పశు, గొర్రెల కాపరులు చెట్ల కింద ఉండరాదన్నారు.

గడ్చిరోలిలో భారీ ఎన్‌కౌంటర్

12 మంది మావోయిస్టుల కాల్చివేత

మృతుల్లో తిపాగఢ్ దళం ఇన్‌చార్జి లక్ష్మణ్

గడ్చిరోలి: ఎన్‌కౌంటర్ అనగానే ఛత్తీస్‌గఢ్ గుర్తుకొస్తుంది. ఇప్పుడు బిజెపి పాలిత మహారాష్ట్రకు కూడా ఇది విస్తరించింది. బుధవారం గడ్చిరోలిలో 12 మంది మావోయిస్టులను పోలీసులు ఎన్‌కౌంటర్ చేశారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని వండోలి గ్రామం సమీపంలో 12 నుంచి 15 మంది మావోయిస్టులు సమావేశమయ్యారని సమాచారం అందడంతో డిప్యూటీ ఎస్పీ సారథ్యంలో పోలీసులు ఆ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహిస్తుండగా నక్సల్స్ కాల్పులు జరిపారని, దీంతో పోలీసులు ఎదురు కాల్పులకు దిగినట్లు పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. దాదాపు ఆరు గంటల పాటు కాల్పులు జరిగాయి.

ఇప్పటివరకు 12మంది మృతదేహాలను గుర్తించామని, అలాగే ఘటనా స్థలిలో మూడు ఏకే 47 తుపాకీలతో పాటు పలు ఆయుధాలను దొరికాయని పోలీసులు తెలిపారు. మృతుల్లో తిపాగడ్ దళం ఇన్‌చార్జి డీవీసీఎం లక్ష్మణ్ ఆత్రం అలియాస్ విశాల్ ఆత్రం ఉన్నట్టు వారు వెల్లడించారు. మిగతా మృతదేహాలను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. మరోవైపు, ఈ కాల్పుల్లో ఒక జవాన్‌కు బుల్లెట్ గాయాలు కాగా.. చికిత్స నిమిత్తం నాగ్‌పూర్‌కు తరలించినట్టు భద్రతా అధికారులు తెలిపారు.



2

నిండిన ఆల్మట్టి.. దిగువకు కృష్ణమ్మ పరుగులు

సిఐ, ఎస్ఐ సస్పెన్షన్

- ముచ్చుమర్రి ఘటనపై కర్నూలు రేంజ్ డిఐజి చర్యలు

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్ / నందికొట్కూరు టౌన్

నంద్యాల జిల్లా నందికొట్కూరు రూరల్ సిఐ ఒ.విజయభాస్కర్, ముచ్చుమర్రి ఎస్ఐ ఆర్.జయశేఖర్‌లను కర్నూలు రేంజ్ డిఐజి సిహెచ్.విజయరావు బుధవారం సస్పెండ్ చేశారు. ముచ్చుమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక అదృశ్యం, లైంగిక దాడి, హత్య కేసులో విధుల పట్ల అలసత్వం వహించారంటూ, క్రమశిక్షణ ఉల్లంఘించారంటూ సస్పెన్షన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్ బాలిక హత్య కేసులో ముగ్గురు బాలురను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. తొమ్మిదేళ్ల బాలిక ఆడుకోవడానికి పది రోజుల క్రితం పార్కుకు వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె తండ్రి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీంతో, మిస్సింగ్ కేసుగా నమోదు చేసి బాలిక ఆచూకీ కోసం ఆత్మకూరు డిఎస్‌పి ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్లారు. ముగ్గురు మైనర్ బాలురు బాలికను అత్యాచారం చేసి అనంతరం గొంతు నులిమి చంపేశారని, ఆ తర్వాత



సిఐ ఒ.విజయభాస్కర్



ఎస్ఐ ఆర్.జయ శేఖర్

మృతదేహాన్ని కొంతదూరం సైకిల్‌పై, మరికొంత దూరం మోటార్ సైకిల్‌పై తీసుకెళ్లారని, వారి తండ్రుల సహాయంతో మృతదేహానికి రాయి కట్టి కృష్ణా నది బ్యాక్ వాటర్‌లో పడేశారని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. సిఐ స్థాయి అధికారులతో ఆరు బృందాలను ఏర్పాటు చేసి గజ ఈతగాళ్లను, ఎస్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను, ఆరు ప్రత్యేక బృందాలను, డాగ్ స్క్వాడ్‌ను, డ్రోన్ కెమెరాలను, టెక్నికల్ టీములను రంగంలోకి దింపి గాలింపు చర్యలు చేపట్టినా బాలిక ఆచూకీ లభ్యం కాలేదు. నేటికీ పోలీసు బృందాలు బాలిక ఆచూకీ కోసం గాలిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేసును ఛేదించడంలో విఫలమయ్యారంటూ సిఐ, ఎస్ఐలను సస్పెండ్ చేస్తూ కర్నూలు రేంజ్ డిఐజి ఆదేశాలు జారీ చేశారు.

ఇళ్లు ఇవ్వకుండానే ఎన్‌పిఎలుగా లబ్ధిదారులు

- టిడ్కోలో విచిత్రం
- రాష్ట్ర వ్యాప్తంగా 13,386 మందిని ప్రకటించిన బ్యాంకర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

టిడ్కో కింద ఇల్లు వచ్చిందని అధికారులు చెప్పడం, లబ్ధిదారునితో సంతకాలు పెట్టించుకోవడం చకచకా జరిగిపోయాయి. కానీ ఇల్లూ రాలేదూ, ఇంటి తాళామూ ఇవ్వలేదు. బ్యాంకులు మాత్రం నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్(ఎన్‌పిఎ)లుగా ప్రకటిస్తున్నాయి. ఇలా రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వేలాదిమంది ఎన్‌పిఎలుగా మారారు. అయితే, లబ్ధిదారులను ఎన్‌పిఎల్లో చేర్చొద్దని, కొంత గడువు ఇవ్వాలని ప్రభుత్వం బ్యాంకర్లను కోరింది. దీనిపై పరిశీలించిన బ్యాంకర్ల సబ్ కమిటీ ఆర్‌బిఐ నిబంధనల ప్రకారం ఇప్పటికే రెండేళ్లు మారిటోరియం ఇచ్చామని, ఇక ఇవ్వడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. దీంతో ఎన్‌పిఎల సంఖ్య అనూహ్యంగా పెరిగిపోతోంది.



అయితే లబ్ధిదారులకు ఇళ్లు కేటాయిస్తే బ్యాంకర్లు వాటిని తనఖా పెట్టుకునేవారు. లబ్ధిదారులకు నోటీసులిచ్చేవారు. ఇప్పటికే చాలా చోట్ల నోటీసులు ఇస్తున్నారు. ఇటీవల ఓ లబ్ధిదారుడు తాను బ్యాంకర్ల వేధింపులు భరించలేనంటూ గుడివాడ టిడ్కోకాలనీలో ఓ ఇంటి మీద నుండి కిందకు దూకబోయాడు. ఇలాంటి ఘటనలు రాష్ట్రవ్యాప్తంగా టిడ్కో కాలనీల్లో పెరుగుతున్నాయి. దీనిపై ప్రభుత్వం స్పందించి మారిటోరియం గడువును పెంచాలని, లేదా రుణాలు రద్దు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఇళ్లు పొందిన వారు రుణబకాయిలు ఒకెత్తయితే అసలు ఇళ్లే తీసుకోకుండా నిరర్థక బకాయిదారులుగా మిగలడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో టిడ్కో ఇళ్లకు మిగతా 5లో

బ్యాంకుపేరు	ఎకౌంట్లు	ఎన్‌పిఎలు
యూనియన్ బ్యాంకు	20863	6919
ఎస్‌బిఐ	15250	658
బ్యాంక్ ఆఫ్ బరోడా	6027	967
కెనరాబ్యాంకు	5374	347
ఇండియన్ బ్యాంకు	4945	1554
బ్యాంక్‌ఆఫ్ ఇండియా	3788	754
ఎపిజిబి	2416	963
ఐఒబి	2276	250
పిఎన్‌బి	1924	66
సెంట్రల్ బ్యాంకు	1665	365
ఎపిజివిబి	1600	548
ఎస్‌జిబి	850	237
సిజిజిబి	352	208

సంప్రదింపుల తర్వాతే 'స్థానిక కోటా' బిల్లు

- వివాదం నేపథ్యంలో కర్ణాటక మంత్రి వెల్లడి

బెంగళూరు: కర్ణాటకలో 'స్థానిక కోటా' బిల్లుపై దుమారం రేగడంతో ఈ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ విషయాన్ని బుధవారం రాత్రి భారీ, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి ఎంబి పాటిల్ ప్రకటించారు. 'తదుపరి సంప్రదింపులు, తగిన చర్యలు తీసుకునే వరకూ బిల్లును నిలిపివేస్తున్నాం. పరిశ్రమల అధినేతలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు' అని మంత్రి తెలిపారు. కాగా, సోమవారం క్యాబినెట్ సమావేశంలో ఆమోదించిన ఈ బిల్లు ప్రకారం ప్రైవేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ కోటాలో 70 శాతం, మేనేజ్‌మెంట్ కోటాలో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాలని పేర్కొన్నట్లు బుధవారం ముందుగా ప్రభుత్వం తెలిపింది. కర్ణాటక ప్రైవేట్ సంస్థల్లోని గ్రూప్ సి, డి గ్రేడ్ పోస్టుల్లో కన్నడిగులకు వంద శాతం రిజర్వేషన్ కల్పించే బిల్లుకు ఆమోదం తెలిపిందంటూ సోషల్ మీడియాలో పెద్దయెత్తున ప్రచారం జరిగింది. 'రాష్ట్రంలో నెలకొల్పిన అన్ని ప్రైవేట్ మిగతా 5లో

మందుల పరిశ్రమలో పేలిన రియాక్టర్

ప్రజాశక్తి- అనకాపల్లి ప్రతినిధి, రాంబిల్లి విలేకరి

పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లాలోని అల్ట్రాటెక్ బాలాజీ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ఘటన మరవక ముందే అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్ పరిధి రాంబిల్లి మండలం లాలం కోడూరు శివారులోని వసంత్ కెమికల్స్ ఫ్యాక్టరీలో బుధవారం ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఒక కార్మికుడు మృతి చెందారు. పరిశ్రమ యాజమాన్యం భద్రతా ప్రమాణాలు పాటించకపోవడమే ఈ ప్రమాదానికి కారణమని తోటి కార్మికులు చెప్తున్నారు.

వారి కథనం ప్రకారం... వసంత్ కెమికల్స్‌లో ఒడిశాకు చెందిన ప్రదీప్ రౌత్ (44) హౌస్ కీపర్‌గా పని చేస్తున్నారు. ఉదయం ఆరు గంటలకు విధులకు హాజరయ్యాడు. ఉదయం 8.30 గంటల సమయంలో రియాక్టర్ పేలి పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. అయితే, యాజమాన్యం ఎవరికీ ఏమీ కాలేదని చెప్పి, చనిపోయిన ఆయనను చికిత్స కోసమంటూ అంబులెన్స్‌లో ఎన్‌టిఆర్ ఆస్పత్రికి తరలించి ప్రమాద తీవ్రతను తక్కువ చేసి చూపేందుకు ప్రయత్నించింది.



వసంత్ కెమికల్స్‌లో చెలరేగిన మంటలు

రూ.35 లక్షలు ఎక్స్‌గ్రేషియా : మంత్రి అనిత

ప్రదీప్ రౌత్ కుటుంబానికి రూ.35 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించనున్నట్లు రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత ప్రకటించారు. వసంత కెమికల్స్‌లో జరిగిన ప్రమాదంపై విచారణకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. ఫ్యాక్టరీస్ అండ్ ఇన్‌స్పెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి, రెవెన్యూ విభాగ అధికారులు ప్రమాద ఘటనపై విచారణ చేపట్టి, నివేదిక అందజేయాలని ఈ ఆదేశాల్లో పేర్కొన్నారు.

రూ.కోటి పరిహారం ఇవ్వాలి : సిఐటియు

వసంత్ కెమికల్స్ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుడు ప్రదీప్ రౌత్ కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం ఇవ్వాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు రాము డిమాండ్ చేశారు. పరిశ్రమలో ప్రమాద పరిస్థితిని తెలుసుకున్న కార్మికులతో కలిసి వారు మీడియాతో మాట్లాడారు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రమాదానికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రదీప్‌రౌత్ మృతదేహాన్ని అనకాపల్లిలోని ఎన్‌టిఆర్ ఆస్పత్రి మార్చురీలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు, కోశాధికారి వివి శ్రీనివాసరావు తదితరులు పరిశీలించారు. అనంతరం కార్మిక, కర్షక భవన్‌లో మిగతా 5లో

లోపలి పేజీలో..

పరిశ్రమల్లో భద్రతా లోపం
- ప్రమాదాల్లో బయటపడుతున్న యాజమాన్య వైఫల్యం
- అయినా పట్టించుకోని ప్రభుత్వాలు
- బలవుతున్న కార్మికులు, కుటుంబాలు

'అరణ్య'రోదనే
- 2016 నుండి పెరగని అడవుల విస్తీర్ణం

ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్



స్వర్ణాల చెరువు వద్ద యాత్రికుల తాకిడి

ఘనంగా రొట్టెల పండుగ ప్రారంభం

- తొలి రోజు లక్షమంది హాజరు

ప్రజాశక్తి- నెల్లూరు ప్రతినిధి

కుల, మతాలకు అతీతంగా, మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రొట్టెల పండుగ నెల్లూరులో బుధవారం ఘనంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు ఈ పండుగ జరగనుంది. మన రాష్ట్రంతో పాటు, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి కూడా వచ్చి నెల్లూరులోని స్వర్ణాల చెరువులో స్నానం ఆచరించి రొట్టెలు మార్చుకున్నారు. అనంతరం పక్కనే ఉన్న బారా షాహీద్ దర్గాను దర్శించుకున్నారు. తొలిరోజు లక్షమంది వచ్చారని అధికారులు తెలిపారు. హిందువులు, ముస్లిములు, క్రిస్టియన్లు, సిక్కులు, జైనులతోపాటు అన్ని మతాల వారూ, సామాజిక తరగతులవారు భాగస్వాములు కావడం ఈ పండుగ ప్రత్యేకత.

ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు (అల్లూరి జిల్లా)
ఏజెన్సీలో స్పెషల్ డిఎస్‌సి నిర్వహించాలని ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. అల్లూరి జిల్లా సిపిఎం విస్తృత సమావేశం పాడేరులోని కాఫీ హౌస్‌లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రాజకీయ పరిస్థితులు, దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాల తీరు, ఓట్ల గణాంకాలను పార్టీ శ్రేణులకు విశదీకరించి భవిష్యత్తు కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. సిపిఎం అధికారంలో ఉన్న రాష్ట్రం, ఇతర రాష్ట్రాల్లోనూ ఎన్నికల తీరుపై వివరించారు. గతంలో నిర్వహించిన అనేక ప్రజా సమస్యల పోరాటాలను కొనసాగించాలని, జిఒ 3 పునరుద్ధరణ, భాషా వలంటీర్ల రెగ్యులర్, ఏకలవ్య పాఠశాలల్లో స్థానికులను ఉపాధ్యాయులుగా నియమించడం తదితర గిరిజన సమస్యలపై స్పందించాలని కోరారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యవస్థీకృత సంక్షోభంలో ఉందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఇలాంటి సంక్షోభాన్ని అధిగమించడానికి ఆందోళనలకు సిద్ధమవ్వాలని, రాబోయే కాలం ప్రజా ఉద్యమాల కాలమని, వ్యవస్థ మీద తిరుగుబాటు చేసే ప్రభుత్వాలు కూడా ఉద్యమాలు సాగే పరిస్థితులు ఉన్నాయని పేర్కొన్నారు. బిజెపి మతోన్మాద వైఖరిపై టిడిపి, వైసిపి, జనసేన మాట్లాడటం లేదని, గత ఐదేళ్లలో బిజెపికి మద్దతు ఇచ్చి రాష్ట్రంలో కేంద్రం చెప్పిందల్లా చేసిన వైసిపి ప్రభుత్వం 2024 ఎన్నికల్లో పూర్తిగా అడుగంటిపోయిందని గుర్తుచేశారు. అయినా కూడా జగన్ పాఠాలు నేర్చుకోవడం లేదని, మళ్లీ మోడీనే బలపరుస్తున్నారని విమర్శించారు. బిజెపిని పూర్తిగా బలహీనపరిచేందుకు ఐక్య పోరాటాలు సాగించాలని, ఇందుకు విశాల వేదికపై లౌకిక ప్రజాశక్తులను సమీకరించాలని సూచించారు. సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో అల్లూరి జిల్లా వ్యాప్తంగా సిపిఎం పట్ల ప్రజాభిమానం వెల్లువెత్తిందన్నారు. రానున్న కాలంలో ప్రజాబలం మరింత కూడగట్టుకొని స్థానిక ఎన్నికల్లో సిపిఎం అత్యధిక స్థానాలను గెలుచుకునేలా పార్టీ శ్రేణులు నిరంతరం కృషి చేయాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ.. బిజెపిని పాలకవర్గ సభ్యుల ఆమోదం లేకుండా కోట్లది రూపాయలు ఖర్చు చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు.

మెడికల్ క్యాంపులు నిర్వహించాలి
పాడేరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, జిల్లా నాయకులు కె.సురేంద్ర, అనంతగిరి జడ్‌పిటిసి డి.గంగరాజు సందర్శించారు. రోగులతో మాట్లాడారు. వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జ్వర బాధితులకు ప్రత్యేక రక్త పరీక్షలు నిర్వహించాలని, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలను తక్షణమే ప్రారంభించాలని, గత ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని చంద్రబాబు ప్రభుత్వం అవలంబించరాదని కోరారు.



పాడేరు ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు, తదితరులు



నిండిన ఆల్మట్టి..

దిగువకు కృష్ణమ్మ పరుగులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఎగువన కృష్ణ పరీవాహక ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కృష్ణా నదిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మహారాష్ట్ర, కర్నాటకలోని కృష్ణా పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ఎగువన వున్న ఆల్మట్టి డ్యామ్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతుండటంతో దిగువకు నీటిని వదులుతున్నారు. బుధవారం ఉదయానికి ఆల్మట్టిలోకి దాదాపు లక్ష క్యూసెక్కుల వరద ప్రవాహం నమోదవుతుండటంతో అధికారులు గేట్లు ఎత్తి 65 వేల క్యూసెక్కులు దిగువన వున్న నారాయణపూర్‌లోకి వదిలారు. నారాయణపూర్ డ్యామ్ సామర్ధ్యం 37 టిఎంసీలే కావడంతో అక్కడి నుండి దిగువకు జూరాల ప్రాజెక్టు వైపుకు 28,560 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టు డ్యామ్ సామర్ధ్యం కేవలం 9.5 టిఎంసీలే కావడంతో కృష్ణ నదిలో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువన్న శ్రీశైలం వైపు వదిలే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. దీంతో త్వరలోనే శ్రీశైలం ప్రాజెక్టు వద్దకు వరదనీరు వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఆల్మట్టి పూర్తిస్థాయి సామర్ధ్యం 129 టిఎంసీలు కాగా ప్రస్తుతం 100 టిఎంసీలను రిజర్వాయర్‌లో నిలకడగా వుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. అలాగే 37 టిఎంసీల సామర్ధ్యం వున్న నారాయణపూర్ డ్యామ్‌లో 30 టిఎంసీల నీటిని స్థిరంగా వుంచి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు వదులుతున్నారు. రాష్ట్రంలోని శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జున సాగర్, పులిచింతల ప్రాజెక్టులు డెడ్ స్టోరేజ్ స్థాయిలోనే వున్నాయి. శ్రీశైలంలో కేవలం 33.9 టిఎంసీల నీరు మాత్రమే వుంది. శ్రీశైలం ప్రాజెక్టుకు ఎగువన వున్న ప్రాజెక్టులన్నీ నిండిపోవడంతో కృష్ణాలోకి వరద వచ్చే అవకాశం వుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీంతో శ్రీశైలం నుండి తాగునీటి అవసరాలకోసం నాగార్జున సాగర్‌కు దాదాపు 30వేల క్యూసెక్కులను వదులుతున్నారు.

తుంగభద్రకు పోటెత్తుతున్న వరద

ప్రజాశక్తి- రాయదుర్గం (అనంతపురం జిల్లా)
కర్నాటకలోని ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో తుంగభద్ర జలాశయానికి వరద నీరు పోటెత్తుతోంది. ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం తుంగభద్ర డ్యాంలోకి 63,320 క్యూసెక్కులు ఇన్ ఫ్లో ఉండగా, అవుట్ ఫ్లో 212 క్యూసెక్కులుగా ఉంది. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసీలు కాగా, ప్రస్తుతం 39.718 టిఎంసీలు ఉన్నాయని డ్యాం సెక్షన్ అధికారి రాఘవేంద్ర తెలిపారు. వర్షాలు కొనసాగే ఆస్కారం ఉన్నందున డ్యాంలోకి మరింత నీరు చేరే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మదన్‌పై కఠిన చర్యలు

- మహిళా సంఘాల ఐక్య వేదిక డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనరుగా పనిచేస్తున్న మహిళ ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యవహరిస్తున్న మదన్‌మోహన్‌పై పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మహిళా సంఘాల ఐక్యవేదిక తరుపున డి రమాదేవి (ఐద్వా), ఆర్ గంగాభవాని (పిఒడబ్ల్యు), పి దుర్గాభవాని (మహిళా సమాఖ్య), పి నాగమణి (ఇప్వా) బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనరు భర్తను అని చెప్పుకుంటూ మదన్‌మోహన్ అనే వ్యక్తి తన భార్యకు పుట్టిన బిడ్డకు తండ్రి ఎవరో తేల్చాలని దేవదాయ కమిషనరుకు లేఖ రాయడం అనైతికమని అన్నారు. వారం రోజులుగా ఆ మహిళ ఆత్మగౌరవానికి భంగం కలిగేలా టివిలలో చర్చలు నడపడం తగదని పేర్కొన్నారు. దేవాదాయశాఖ అధికారి, విజయసాయిరెడ్డి అవినీతికి పాల్పడి వుంటే చట్టపరంగా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి తప్ప ఇలాంటి చౌకబారు విమర్శలతో మహిళల ఆత్మగౌరవం దెబ్బతినేలా వ్యవహరించడం తగదని అన్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా చిన్నారులపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమల్లో భద్రతా లోపం

- ప్రమాదాల్లో బయటపడుతున్న యాజమాన్య వైఫల్యం
- అయినా పట్టించుకోని ప్రభుత్వాలు
- బలవుతున్న కార్మికులు, కుటుంబాలు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి
పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో జరుగుతున్న ప్రమాదాలకు కార్మికులు బలవుతున్నారు. గత పదేళ్లగా వివిధ పరిశ్రమల్లో వేర్వేరు కారణాలతో జరిగిన ప్రమాదంలో 40 మందికిపైగా కార్మికులు మరణించారు. 130 మందికిపైగా గాయపడ్డారు. ప్రమాదాలకు యాజమాన్య తప్పిదాలే కారణమని నివేదికల్లో బయటపడుతున్నా, ప్రభుత్వ నియంత్రణ చర్యలు అమలు చేయడం లేదు. తాజాగా యాజమాన్య తప్పిదం కారణంగా బుధవారం ఉదయం అచ్యుతాపురం సెజ్, రాంబిల్లి మండలంలోని వసంత్ కెమికల్స్‌లో రియాక్టర్ పేలిన ప్రమాదంలో ఒకకారు చెందిన కార్మికుడు ప్రదీప్ రౌత్ (44) అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసులొచ్చిన విధంగా ఆయన మృతదేహం ఉంది. అధిక ఉష్ణోగ్రతలు, ఒత్తిడిని నియంత్రించే ఆటోమెటిక్ వ్యవస్థలు ఏర్పాటు చేయని పరిశ్రమల్లో రియాక్టర్ పేలుడు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అధిక ఒత్తిడి వాల్వ్ లీక్ మెటీరియల్ బయటకు రావడంతో మంటలు వ్యాపించి రియాక్టర్ పేలడం పరిపాటిగా మారింది. వసంత్ కెమికల్స్‌లో ఈ తరహా ప్రమాదమే జరిగింది. ఒత్తిడిని నియంత్రించే ఆటోమెటిక్ వ్యవస్థ ఉంటే ప్రదీప్ రౌత్ చనిపోవడానికి అవకాశం ఉండేది కాదని పరిశ్రమల తనిఖీ విభాగ అధికారులు చెబుతున్నారు.

గతేడాది జూన్ 30న అచ్యుతాపురం ప్రాంతంలోని సాహితీ ఫార్మాలో జరిగిన ప్రమాదంలో ఆరుగురు మరణించారు. ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యమే కారణమని జాయింట్ కలెక్టర్ నేతృత్వంలోని విచారణ కమిటీ నిర్ధారణకు వచ్చినా పోరాటాలు నివారించే ప్రయత్నం చేయడం లేదు. ప్రమాద తీవ్రతను తగ్గించే ప్రత్యామ్నాయ వ్యవస్థలు ఏర్పాటు చేయకపోవడం, రక్షణ పరికరాలు కార్మికులకు ఇవ్వకపోవడం, ప్రమాదం జరిగినప్పుడు తప్పించుకొనే మార్గాలు ఉంచకపోవడంతో ప్రమాద సమయాల్లో కార్మికులు బలవుతున్నారు. ఒడిశా, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, బీహార్, తెలంగాణ రాష్ట్రాల నుంచి తక్కువ జీతాలకు వచ్చే విద్యార్హత, నైపుణ్యంలేని కార్మికులకు ప్రమాదకర ప్రదేశాల్లో పని అప్పగిస్తున్నారు. గతంలో సాహితీ ఫార్మా యాజమాన్య తప్పిదం వల్ల ఆరుగురు మృతి చెందారు. వసంత్ కెమికల్స్‌లో జరిగిన ప్రమాదంలో యాజమాన్య వైఫల్యం ఉందని కార్మికులు చెప్పున్నారు. పరవాడ ఫార్మా, అచ్యుతాపురం సెజ్ పరిశ్రమల్లో ప్రమాదాలకు యాజమాన్య వైఫల్యాలు కొట్టొచ్చినట్లు కన్పిస్తున్నా అయినా, ప్రభుత్వం ఆ లోపాలను సరిచేసే కనీస ప్రయత్నం చేయలేదు.

బయటకు రాని 'బ్రాండిక్స్' విషవాయువు లీక్ నివేదిక
బ్రాండిక్స్ ఇండియా అపెరెల్ సిటీలో సీడ్స్ వస్త్ర పరిశ్రమలో 2022 జూన్ మూడు, ఆగస్టు 2న విష వాయువులు లీకవడంతో 539 మంది అస్వస్థతకు గురై ఆస్పత్రిపాలయ్యారు. ఈ ప్రమాదంపై నివేదికలు ఇప్పటికీ బయటకు పెట్టలేదు. యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోలేదు. పరిశ్రమల్లో సేఫ్టీ ఆడిట్ నిర్వహించి, నివేదిక నోటీస్ బోర్డులో ప్రదర్శించినప్పుడే పరిశ్రమలో భద్రతపై కార్మికులకు అవగాహన కలుగుతుంది. వాస్తవాలు కార్మికులకు తెలియనీయకుండా లోపాలను యాజమాన్యాలు దాచిపెడుతున్నాయి.




వసంత్ కెమికల్స్ ఫ్యాక్టరీ

బోగస్ చేనేత సహకార సంఘాలను రద్దు చేయాలి

మంత్రి లోకేష్‌కు ఏపి చేనేత కార్మిక సంఘం వినతి

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)
రాష్ట్రంలో విచ్చలవిడిగా వెలసిన బోగస్ చేనేత కార్మిక సంఘాలను రద్దు చేయాలని, క్షేత్రస్థాయిలో పని చేస్తున్న సహకార సంఘాలను ప్రోత్సహించాలని మంత్రి నారా లోకేష్‌కు ఏపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ వినతిపత్రం అందజేశారు. చేనేతకు కేటాయించిన 14 రకాల రిజర్వేషన్లు కచ్చితంగా అమలు చేయాలని, చేనేత కార్మికుల సంక్షేమం కోసం వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించడంతో పాటు జిఎస్‌టి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు ఒక సెంట్ స్థలంలో ఇళ్లు నిర్మించి, మగ్గం షెడ్లు నిర్మించడంతో పాటు మగ్గం గోతులు వారికి 'నేతన్న నేస్తం' పథకం అమలు చేయాలని, చేనేత మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సాయం అందజేయడంతో పాటు పట్టు, జరీ, నూలు ధరలను తగ్గించాలని కోరారు. చేనేత వస్త్రాలపై 30 శాతం రిబేటును సంవత్సరం మొత్తం కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. మంత్రిని కలిసిన వారిలో ఏపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కట్టా శివదుర్గారావు, నాయకులు కొతరవు వెంకటేశ్వరరావు, దోతికర్తి రామారావు ఉన్నారు.



లోకేష్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

టిడిపి కార్యాలయంలో 'ప్రజా దర్బార్'

- వినతులు స్వీకరించిన మంత్రి సవిత

ప్రజాశకి-అమరావతి బ్యూరో
టిడిపి కార్యాలయంలో 'ప్రజా దర్బార్' బుధవారం జరిగింది. కార్యకర్తలు, ప్రజల నుంచి బిసి సంక్షేమశాఖ మంత్రి సంజీవరెడ్డిగారి సవిత బుధవారం సమస్యలు, ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. తమకు వచ్చిన ఫిర్యాదుల్లో అధికంగా వైసిపి నేతల భూ కబ్జాలు, గంజాయి, అమ్మాయిల మిస్సింగ్‌తోపాటు అనేకం ఉన్నాయని చెప్పారు. తన పరిధిలో ఉన్న సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్ చేసి పరిష్కరించినని తెలిపారు. లీగల్ సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి కోసం తాము ముందుకెళ్తున్నామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని అన్నారు. త్వరలో అన్న క్యాంటీన్లను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్రాన్ని అంధకారంలోకి నెట్టిన వైసిపి నేతలు మాట్లాడానికి కూడా అనర్హులని విమర్శించారు.

111 మంది ప్రమోటివ్ ఎస్‌ఐల బదిలీ

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్
ఏలూరు రేంజ్ పరిధిలో 111 మంది ప్రమోటివ్ ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఏలూరు రేంజ్ డిఐజి జివిజి అశోక్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల్లో పని చేస్తున్న ప్రమోటివ్ ఎస్‌ఐలకు స్థానచలనం కలిగింది. ఈ 111 మందిని ఆయా జిల్లాల నుంచి వేరే జిల్లాలకు బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా జిల్లాల ఎస్‌పిలు ఆ ఎస్‌ఐలకు పోస్టింగ్ ఆర్డర్స్ (కౌంటర్ కాపీ) ఇవ్వాల్సి ఉంది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006
ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబరుకు ఉదయం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విషయాలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపవలసిన
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ editorprajasakthi@gmail.comకు పంపవచ్చు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటి మట్టం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం, ఆచంట
తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా పెరిగింది. ప్రస్తుతం కాటన్ బ్యారేజీవద్ద 10.35 అడుగుల నీటిమట్టం ఉంది. బ్యారేజీకి చెందిన 175 గేట్లలో 130 క్రస్టర్ గేట్లను 20 మిల్లీమీటర్ల మేర పైకెత్తారు. 70 వేల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడిచిపెడుతున్నారు. వ్యవసాయ అవసరాల నిమిత్తం తూర్పు డెల్టాకు మూడు వేల క్యూసెక్కులు, మధ్య డెల్టాకు 1,700 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం కోడేరు వద్ద గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగింది.

ఎస్‌కె యూనివర్శిటీ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - అనంతపురం
అనంతపురం జిల్లా శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం హాస్టల్ విద్యార్థిని బుధవారం ఉదయం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బంధువులు, తోటి విద్యార్థులు తెలిపిన సమాచారం మేరకు.. కడప జిల్లా పులివెందులకు చెందిన మేఘన (21) ఎస్‌కెయులో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. బుధవారం కళాశాలకు సెలవు కావడంతో హాస్టల్‌లోనే ఉన్నారు. టిఫిన్ కోసం తోటి విద్యార్థులు బయటకు వెళ్లిన తర్వాత ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. తిరిగొచ్చిన విద్యార్థులు గది తలుపులు తెరిచే ప్రయత్నం చేయగా లోపలి నుంచి గడియ వేసుండటంతో సమాచారాన్ని వార్డెన్‌కు తెలియజేశారు. తలుపులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు వేళ్లాడుతూ విద్యార్థిని కనిపించారు. ప్రాథమిక చికిత్స తర్వాత అనంతపురం సర్వజన ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఇటుకలపల్లి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంజినీరింగ్‌లో 1,17,136 సీట్లు భర్తీ

- ముగిసిన తొలిదశ కౌన్సెలింగ్


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో కన్వీనర్ కోటాలో 1,17,136 సీట్లు భర్తీ అయ్యాయి. ఈ నెల ఒకటిన ప్రారంభమైన ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మా ఉమ్మడి ప్రవేశాల పరీక్ష (ఇఎపిసెట్) తొలిదశ కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసిందని ఇఎపిసెట్ కన్వీనర్ బి నవ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇఎపిసెట్-2024లో ఇంజనీరింగ్ అభ్యర్థులు 1,86,031 మంది అర్హత సాధించారు. వీరిలో 1,28,619 మంది కౌన్సెలింగ్‌కు రిజిస్టర్ చేసుకోగా, 1,28,065 మంది అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. రాష్ట్రంలో ఉన్న 245 ఇంజనీరింగ్ కళాశాలల్లో కన్వీనర్ సీట్లు 1,36,660 అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 1,17,136 సీట్లు భర్తీ కాగా, 19,524 సీట్లు కాలేదు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరైన వారిలో 1,26,608 మంది 44,69,203 ఆప్షన్లు ఇచ్చారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) నుంచి మెరిట్ జాబితా రాకపోవడంతో 609 మందికి, ఎన్‌సిసి డైరెక్టర్ నుంచి మెరిట్ జాబితా రాకపోవడంతో 1,217 మందికి సీట్ల కేటాయింపు చేయలేదని పేర్కొన్నారు.

యాజమాన్యం	కళాశాలల సంఖ్య	కన్వీనర్ సీట్లు	భర్తీ	మిగులు
యూనివర్శిటీ	24	6,877	6,189	688
ప్రైవేట్	212	1,21,951	1,03,247	18,704
ప్రై.యూనివర్శిటీ	9	7832	7,700	132
మొత్తం	245	13,6660	1,17,136	19,524

నరసాపురం ఎంపిడిఒ కోసం గాలింపు

- ఏలూరు కాల్వలో దూకినట్లు అనుమానం

ప్రజాశక్తి - కంకిపాడు, నరసాపురం
కృష్ణా జిల్లాలో అదృశ్యమైన పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం ఎంపిడిఒ మండవ వెంకటరమణారావు కోసం పోలీసులు గాలిస్తున్నారు. విజయవాడ సమీపంలోని కానూరు మహదేవపురం కాలనీలో నివాసముంటున్న ఆయన మొబైల్ సిగ్నల్‌ను పోలీసులు ట్రాక్ చేయగా.. విజయవాడ మధురానగర్ ఏలూరు కాల్వ వద్ద సిగ్నల్ కట్టయినట్లు గుర్తించారు. దీంతో ఆయన ఏలూరు కాల్వలో దూకి ఉండొచ్చని అనుమానించి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నెల 10 నుంచి 20వ తేదీ వరకు సెలవు పెట్టి ఆయన కానూరు వచ్చారు. మచిలీపట్నంలో పని ఉందంటూ 15న ఇంట్లో చెప్పి బయటకు వెళ్లారు. ఆరోజు రాత్రి పది గంటలకు ఫోన్‌చేసి, తాను బందరులో ఉన్నానని, ఇంటికి రావడానికి ఆలస్యమవుతుందని తెలిపారు. ఆ తర్వాత ఆయన ఆచూకీ తెలియలేదు. అర్ధరాత్రి దాటాక 'నా పుట్టిన రోజైన 16వ తేదీయే.. నేను చనిపోయే రోజు కూడా. అందరూ జాగ్రత్త' అని భార్య ఫోన్‌కు మెసేజ్ పంపారు. దీంతో కుటుంబసభ్యులు మంగళవారం పెనమలూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ. 54 లక్షల బకాయిలు చెల్లించాలని మాధవాయిపాలెం ఫెర్రీ పాటదారుడు రెడ్డప్ప ధవేజీని అడిగితే బెదిరిస్తున్నారని, తనకు న్యాయం చేయండి అంటూ డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు సైతం లేఖ రాసినట్లు సమాచారం.



అంచనా ఉంటాం : ఎమ్మెల్యే నాయకర్
రమణారావు కుటుంబానికి ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం-సఖినేటిపల్లి ఫెర్రీ వ్యవహారంలో బాధ్యులపై కేసులు నమోదు చేయాలన్నారు. మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు ఒత్తిడి వల్లే ఎంపిడిఒ అదృశ్యమయ్యారని ఆరోపించారు.

ఎంపిడిఒ అదృశ్యంపై విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
నరసాపురం ఎంపిడిఒ ఎమ్ వెంకటరమణారావు అదృశ్యం, అందుకు దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ బుధవారం ఆదేశించారు. అదృశ్యమైన అధికారి ఆచూకీ కనిపెట్టే చర్యలను వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. వెంకటరమణారావు రాసిన లేఖ, అందులోని వివరాల గురించి డిప్యూటీ సిఎం ఆరా తీశారు. నరసాపురం ఫెర్రీ కాంట్రాక్టరు బకాయిలు అంశాన్ని లేఖలో ప్రస్తావించిన విషయాన్ని పవన్‌కల్యాణ్ దృష్టికి అధికారులు తీసుకెళ్లారు. ఫెర్రీ బకాయిల వివరాలు, ఈ విధంగా బకాయిలు పెడుతున్న వారి వివరాలు తక్షణమే అందించాలని ఆయన కోరారు. ఒక అధికారి అదృశ్యమయ్యే పరిస్థితికి కారకులైన వారిపై చట్ట ప్రకారం చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు.

'అరణ్య'రోదనే

- 2016 నుండి పెరగని అడవుల విస్తీర్ణం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి
అడవుల పెంపకంపై రాష్ట్రంలో శ్రద్ధ తగ్గిపోతోంది. లక్షల ఎకరాల్లో పచ్చదనం కోసం మొక్కలు నాటుతున్నట్లు అటవీ శాఖ అధికారులు పదేపదే చెబుతున్నప్పటికీ అడవులు మాత్రం ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. గత పదిహేనేళ్లగా పరిశీలిస్తే అటవీ భూమి పెరిగింది కేవలం రెండు లక్షల హెక్టార్లు మాత్రమే. అది కూడా 2008-09 నుంచి 2013-14 వరకు కేవలం 26 వేల హెక్టార్లు మాత్రమే పెరిగినట్లు కనిపించగా, ఆ తరువాత సంవత్సరంలో 1.7 లక్షల హెక్టార్ల వరకు పెరిగింది. ఆ తరువాత నుండి అడవుల పెంపకం ముందుకుసాగడం లేదు. 2015-16 సంవత్సరంలో 36.88 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో అటవీ భూమి ఉన్నట్లు రికార్డుల్లో గుర్తించగా 2021-22 వరకు అంతే భూమి ఉన్నట్లు అధికారులు తమ నివేదికల్లో తేల్చి చెప్పడం గమనార్హం.

తగ్గుతున్న అటవీకరణ
అటవీ భూమి పెరగడంపై అధికారులు భిన్న వాదనలు వినిపిస్తున్నప్పటికీ వాస్తవానికి కొంతవరకు అటవీ భూమి తగ్గుతోందన్న విమర్శలు వస్తున్నాయి. ఎర్రచందనం, టేకు, ఇతర ఖరీదైన కలప కోసం కొండల్లో చెట్లు కొట్టివేతలు జోరుగా సాగుతున్నాయి. కార్పొరేట్ల ప్రయోజనాల కోసం కూడా అటవీభూములను అప్పగిస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో చెట్లు కొట్టివేత కారణంగా వన్య ప్రాణులు జనజీవనంలోకి వస్తున్నాయి.



అసోసియేషన్ సమావేశంలో ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, గళ్లా మాధవి, ఆర్.వి.స్వామి తదితరులు

చిన్న హోటల్స్‌కు జిఎస్‌టి మినహాయింపు

- రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వి స్వామి డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
చిన్న హోటల్స్‌కు జిఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర హోటల్స్ అనుబంధ పరిశ్రమల అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వి స్వామి డిమాండ్ చేశారు. గుంటూరు- అమరావతి రోడ్డులో బుధవారం అసోసియేషన్ రాష్ట్ర సమావేశం జరిగింది. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అనేక సమస్యల్లో హోటల్స్ ఉన్నాయని అన్నారు. రాత్రి వేళ ఇంటికి వెళ్లే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులకు సెకండ్‌షోకు వెళ్లే వచ్చే వారికి ఆహారపదార్థాలు అందుబాటులో ఉండేందుకు 12 గంటల వరకూ హోటల్స్ నడుపుకునేందుకు అనుమతినివ్వాలని కోరారు. రాష్ట్రంలో హోటల్ పరిశ్రమ విస్తరణకు ప్రభుత్వం సహకరించాలని, పర్యాటకరంగం అభివృద్ధిలో భాగంగా హోటల్ రంగాన్ని ప్రోత్సహించాలని, విద్యుత్ రాయితీలు ఇవ్వాలని కోరారు. 2019కి ముందు అప్పటి టిడిపి ప్రభుత్వం సాధారణ హోటల్స్‌కు కొన్ని మినహాయింపులను ఆంగీకరించిందని గుర్తుచేశారు. ఆ తరువాత అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం తమ పరిశ్రమను పట్టించుకోలేదని, గతంలో ఇచ్చిన ఉత్తర్వులను, హామీలను నెరవేర్చాలని మళ్లీ అధికారంలోకి వచ్చిన సిఎం చంద్రబాబుకు విజ్ఞప్తిచేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి మాట్లాడుతూ హోటల్ రంగాన్ని పర్యాటక రంగంతో అనుసంధానం చేసి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు నాగరాజు, పూర్ణచంద్, పి బాలసుబ్రమణ్యం, నిరంజన్‌రెడ్డి, బి హేమంత్, వై సాంబశివరావు, కె శ్రీనివాసరావు, ఎమ్‌ఎన్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టిటిడి ఛైర్మన్ రేసులో బిఆర్‌కె నాయుడు, వేమిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
తిరుమల తిరుపతి దేవస్థానం(టిటిడి) ఛైర్మన్ రేసులో ఇద్దరి పేర్లు టిడిపిలో వినిపిస్తున్నాయి. రాష్ట్రప్రభుత్వం త్వరలో ఈ ఛైర్మన్ పదవిని భర్తీ చేయనుంది. ఈ పదవి టివి5 ఛైర్మన్ బిఆర్‌కె నాయుడు, నెల్లూరు లోక్‌సభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి గాని దక్కే అవకాశం ఉందని పార్టీలో చర్చ జరుగుతోంది. బిఆర్‌కె నాయుడు పేరు దాదాపు ఖరారైనట్లు పార్టీలో కొంతమంది నేతలు అంటున్నారు. పార్టీ అధికారంలోకి రావడానికి నాయుడు కష్టపడ్డారని, ఆయన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వద్ద మంచి పేరు ఉందని కొంతమంది నేతలు చెబుతున్నారు. అయితే సామాజిక వర్గ లెక్కల్లో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి దక్కే అవకాశం ఉందన్న వాదన కూడా వినిపిస్తోంది. నెల్లూరు జిల్లాలో మొత్తం సీట్లు గెలవడానికి వేమిరెడ్డి కృషి కారణమనే అభిప్రాయం కూడా టిడిపి నేతల్లో ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ఎస్ ప్రసాద్

విద్యారంగ పరిరక్షణ కోసం దశలవారీ ప్రభుత్వానికి వినతులు

- విజయవంతం చేయాలని యుటిఎఫ్ పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ విద్యా రంగాన్ని పరిరక్షించుకోవడం కోసం దశలవారీ రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు అందించే కార్యాచరణను యుటిఎఫ్ ప్రకటించింది. ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలోని యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. సమావేశం నిర్ణయాలను ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ బుధవారం ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు. కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యాచరణను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులందరూ సహకరించాలని కోరారు. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలపై కొత్త ప్రభుత్వం ఇప్పటికీ దృష్టి సారించలేదని పేర్కొన్నారు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గిపోతున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం జిఓ 117ను రద్దు చేసి జిఓ 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలని కోరారు. ప్రీ ప్రైమరీ 1 నుంచి 5 తరగతులను ఒకే పాఠశాలగా నడపాలని, హైస్కూళ్లలో రెండు మీడియాలను సమాంతరంగా కొనసాగించాలని, మున్సిపల్ స్కూళ్లలో పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలని, బదిలీలు, ప్రమోషన్లు నిర్వహించాలని, పిఎఫ్ ఖాతాలను ప్రారంభించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలని, మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుల సర్వీస్ రెగ్యులర్ చేయాలని, పాఠశాలలన్నింటికీ స్కూల్ గ్రాంట్, మెయింటెనెన్స్ గ్రాంట్ మంజూరు చేయాలని, మోడల్ స్కూళ్ల టీచర్లకు కారుణ్య నియామకాలు కల్పించాలని, కిలోమీటర్ దాటి వస్తున్న విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించాలని, వివిధ కారాణాలతో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ప్రమోషన్లు వెంటనే నిర్వహించాలని కోరారు. ఈ అంశాలపై ఈ నెల 22 నుంచి 30 వరకు జిల్లా, రాష్ట్రస్థాయి విద్యాశాఖ అధికారులకు విజ్ఞాపన పత్రాలు, ఆగస్టు 5 నుంచి 15 వరకు రాష్ట్రంలోని అందరూ ఎమ్మెల్యేలకు వినతులు ఇవ్వాలని తెలిపారు. ఆగస్టు 20 నుంచి 30 వరకు 3 వేల సంతకాలతో మంత్రులకు విజ్ఞాపన అందించాలని కోరారు. సెప్టెంబరు ఒకటి నుంచి పదో తేదీ వరకు ముఖ్యమంత్రికి 50 వేల పోస్టు కార్డులు పంపించాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ నిర్ణయాలను అమలు చేసేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు కె శ్రీనివాసరావు, సహాధ్యక్షులు కె సురేష్ కుమార్, ఎఎస్ కుసుమ కుమారి, కోశాధికారి బి గోపి మూర్తి, కార్యదర్శులు లక్ష్మీరాజా, ఎస్‌పి మనోహార్ కుమార్, కెఎ ఉమామహేశ్వరరావు, ఎన్ కిషోర్ కుమార్, ఆర్ మోహన్‌రావు, వి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కారంచేడు మృతవీరులకు ఘన నివాళి

ప్రజాశక్తి - చీరాల (బాపట్ల జిల్లా)

కారంచేడు మృతవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం బాపట్ల జిల్లా చీరాల మండలం విజయనగర కాలనీ గ్రామంలో రుద్రక్షేత్రం వద్ద 39వ సంస్మరణ సభను గ్రామ పెద్దలు నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత, ప్రజాసంఘాల నాయకులు కారంచేడు మృతవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... దళితులందరూ ఐక్యంగా ఉండాలని, ఐక్యతా లోపంతోనే దళితులపై పెత్తందార్ల దాడులకు తెగబడుతున్నారని పేర్కొన్నారు. కారంచేడు ఘటనలో దళితులు, ఇతర ప్రజాసంఘాలు పెద్ద ఎత్తున చేసిన ఐక్య ఉద్యమ ఫలితంగానే నేడు విజయనగర కాలనీ ఏర్పడిందని గుర్తుచేశారు. ముందుగా కాలనీలో మృతవీరుల దినోత్సవ ర్యాలీని నిర్వహించి రుధిర క్షేత్రం వద్ద మృతవీరులకు నివాళులర్పించారు. గతంలో కారంచేడు ఘటనపై విప్లవ కళాకారుడు గద్దర్ పాడిన 'దళిత పులులమ్మ' పాటను ప్రస్తుత సాంకేతిక వాయిద్యాలతో ప్రజాగాయకుడు నూకతోటి శరత్ స్వయంగా పాడి ఆ పాటను ఆవిష్కరించారు.

మృతవీరులకు సిపిఎం నివాళులు

కారంచేడు మృతవీరుల దినోత్సవం సందర్భంగా బుధవారం విజయనగర కాలనీలో ఉన్న రుద్రక్షేత్రం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, ఎన్.బాబూరావు, ఎం.వసంతరావు నివాళులర్పించారు.

రైతు ఆదాయం పెంపునకు కృషి

- వ్యవసాయశాఖ కమిషనరు ఢిల్లీరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యవసాయ రంగానికి అనుసంధానం చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించి రైతులకు ప్రయోజనకరంగా ఉండేలా చేస్తామని వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. మంగళగిరిలోని వ్యవసాయశాఖ ప్రధాన కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతు ప్రయోజనాల కోసం వ్యవసాయశాఖ తీసుకొనున్న చర్యలను వివరించారు. జీవన ప్రక్రియ వ్యవసాయానికి రాష్ట్రానికి లభించిన అంతర్జాతీయ పురస్కారం 'గుల్బెంకియన్ ప్రైజ్ ఫర్ హ్యూమానిటీ' స్ఫూర్తితో ప్రకృతి వ్యవసాయానికి మరింత ప్రోత్సాహం లభించేలా రైతులను సిద్ధం చేస్తామన్నారు. రసాయనాల వినియోగం ద్వారా తగ్గుతున్న భూసారం వల్ల నష్టపోతున్న రైతుల్లో అవగాహన కల్పించేందుకు వ్యవసాయశాఖ కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఆర్‌వివి స్వర్ణ జయలక్ష్మి, వ్యవసాయ విస్తరణ, శిక్షణ కేంద్రం డైరెక్టర్ బి ప్రసాద్, ఆత్మ డైరెక్టర్ వివి విజయలక్ష్మి పాల్గొన్నారు.

అశ్రునయనాలతో వీర జవాను అంత్యక్రియలు

ప్రజాశక్తి - నందిగాం (శ్రీకాకుళం)

జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదుల కాల్పుల్లో అమరుడైన శ్రీకాకుళం జిల్లా నందిగాం మండలం వల్లభరాయుడుపేటకు చెందిన సనపల జగదీశ్వరరావు అంత్యక్రియలు అశ్రునయనాల నడుమ బుధవారం జరిగాయి. వీర జవాను భౌతికకాయం జమ్మూ నుంచి ప్రత్యేక విమానంలో విశాఖపట్నం తీసుకొచ్చారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన బుధవారం ఉదయం ఐదు గంటల సమయంలో నందిగాం పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకుంది. పోలీస్‌స్టేషన్ వద్దకు కుటుంబసభ్యులు, బంధువులు, వల్లభరాయుడుపేట గ్రామస్తులు, అభిమానులు, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు వేకువజామునే చేరుకున్నారు. అక్కడ్నుంచి స్వగ్రామానికి జగదీశ్వరరావు భౌతికకాయాన్ని ఊరేగింపుగా తీసుళ్లారు. జగదీశ్వరరావు భౌతికకాయాన్ని చూసిన కుటుంబ సభ్యులు భోరున విలపించారు. అనంతరం ఆయన నివాసం నుంచి శ్మశానవాటిక వరకు నిర్వహించిన అంతిమయాత్రకు స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జగదీశ్వరరావు గౌరవ సూచకంగా ఆర్మీ సిబ్బంది, పోలీసులు గాల్లోకి మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. అనంతరం కుటుంబీకులు.. వారి సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలను పూర్తి చేశారు. అశ్రునయనాలతో జగదీశ్వరరావుకు అంతిమ వీడ్కోలు పలికారు. అంత్యక్రియల్లో తహశీల్దార్ బి పద్మావతి, టిడిపి నాయకులు ఎల్ఎల్ నాయుడు, ఎం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



అమర జవాన్‌కు గౌరవ సూచికంగా గాల్లోకి తుపాకులు పేల్చుతున్న పోలీసులు

దేవాదాయ భూములను కాపాడాలని వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా అన్యాక్రాంతమైన దేవాదాయ భూములను కాపాడాలని ప్రభుత్వానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విజ్ఞప్తి చేశారు. దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని విజయవాడలో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దేవాదాయ ట్రిబ్యునల్‌ను బలోపేతం చేసి దేవాదాయశాఖకు సంబంధించిన భూముల కేసులు త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేయాలన్నారు.

గాజువాకలో ఉన్మాది ఘాతుకం

ప్రజాశక్తి -గాజువాక (విశాఖపట్నం)

యువతిపై ఉన్మాది దాడికి పాల్పడిన ఘటన విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజవర్గంలోని న్యూ పోర్టు పోలీస్ స్టేషన్ పరిధి ఉడా కాలనీలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దాలిబాబు బుధవారం విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సిఐ కథనం మేరకు.. ఉడా కాలనీలో నివాసముంటున్న శ్యామల గాజువాక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. సిద్ధు తరచూ కాలేజీకి వెళ్లి ఆమెను ప్రేమించమని వెంటపడేవాడు. దీనిపై ఏప్రిల్‌లో స్థానిక పెద్దలు సాయంతో గాజువాక పోలీసులకు శ్యామల కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. దీంతో, పోలీసులు పోక్సో చట్టం కింద సిద్ధును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి జైల్లో ఉన్న సిద్ధు ఈ నెల 5న విడుదలై బయటకు వచ్చాడు. శ్యామలపై కక్ష పెట్టుకొని మంగళవారం రాత్రి ఆమె నివాసముంటున్న ఇంటికి వచ్చి కత్తితో దాడికి ప్రయత్నించాడు. ఆ సమయంలో యువతి తల్లి సావిత్రి అడ్డుకోవడంతో ఆమె చేతికి గాయమైంది. తల్లీకూతుర్లు పెద్దగా కేకలు వేయడంతో స్థానికుల రావడాన్ని గమనించి సిద్ధు పరారయ్యాడు. కేసు నమోదు చేసి సిద్ధు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

నైపుణ్య ఉపాధి కోర్సులు అవశ్యం

- పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విసి

ప్రజాశక్తి - ఎస్‌వియు క్యాంపస్

నైపుణ్యాలతో కూడిన ఉపాధి కోర్సులను ఉన్నత విద్యలో ప్రవేశపెట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డి. భారతి అన్నారు. వర్సిటిలో జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన భారతి మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో ప్లస్ టు, డిగ్రీ స్థాయిలో వృత్తి విద్య, ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు. తమిళనాడు ఓపెన్ యూనివర్సిటీ మాజీ ఉపకులపతి ఆచార్య కె పార్థసారథి మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో సామాజిక, సాంస్కృతిక అంశాలను నొక్కి వక్కాణించాలన్నారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.రజని మాట్లాడుతూ.. ఉపాధి కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించారు.

సురక్షితంగా ఇంటికి చేరిన కువైట్ బాధితుడు

- ఆనందంలో శివ కుటుంబం

ప్రజాశక్తి-వాల్మీకిపురం (అన్నమయ్య జిల్లా)

బతుకుదెరవు కోసం కువైట్‌కు వెళ్లిన బాధితుడు శివ.. అక్కడ ఎడారిలో ఎవ్వరూ లేక పడరాని పాట్లు పడి నరకయాతన అనుభవించి.. చివరకు బుధవారం ఇల్లు చేరారు. ఈ సంఘటన అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం చింతపర్తిలో చోటు చేసుకొంది. మండలంలోని చింతపర్తికి చెందిన శివ నెలక్రితం బతుకు దెరువు కోసం కువైట్‌కు వెళ్లారు. అక్కడ తిండి, నీళ్లు లేక చావే శరణ్యమని సోషల్ మీడియాలో వీడియో పోస్టుపై డిప్యూటీ సిఎం కొణిదెల పవన్ కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించి కువైట్ ఎంబసి అధికారులతో చర్చించి, శివను ఇండియాకు రప్పించేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం సురక్షితంగా చింతపర్తి చేరుకున్నారు. శివను చూసిన భార్య, పిల్లలు ఆయన్ను హత్తుకుని భోరున విలపించారు. బాధితుడు గ్రామానికి చేరుకోవడంతో శివ కుటుంబంతో పాటు చుట్టుపక్కల వారు టిడిపి కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.



స్వగ్రామంలో కుటుంబ సభ్యులతో కువైట్ బాధితుడు శివ

డిగ్రీ గురుకులాల్లో ఫీజుల వసూళ్లు నిలిపేయాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో


సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలల్లో ఫీజులు ఖరారు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఎ అశోక్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలల్లో ఐదేళ్లుగా ఎటువంటి ఫీజు లేకుండా ఉచిత విద్యను ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఇప్పుడు మాత్రం విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయాలని కొత్తగా ఉత్తర్వులివ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. కోర్సును బట్టి రూ.5 వేల నుంచి రూ.14 వేలు చెల్లించాలని చెప్పడం పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని అన్నారు. ప్రభుత్వం వెంటనే తన వైఖరి మార్చుకుని ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేసి, ఉచిత విద్య అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

పోలవరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ

- కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖపట్నం)

పోలవరం ప్రాజెక్టుపై న్యాయ విచారణ చేయాలని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ డిమాండ్ చేశారు. విశాఖ డాబాగార్డెన్స్‌లోని విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. 40 ఏళ్ల క్రితం సిఎం అంజయ్య హయాంలో పోలవరం ప్రాజెక్టు శంకుస్థాపన జరిగిందన్నారు. 2004 నుంచి పనులు వేగవంతం అయ్యాయని గుర్తు చేశారు. అప్పటి సిఎం వైఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో పోలవరం కుడి, ఎడమ కాలువ నిర్మాణంలో ఎన్ని రూ.కోట్లు ఖర్చు చేశారు? కిరణ్‌కుమార్ రెడ్డి హయాంలో ఎవరికి కాంట్రాక్టులు ఇచ్చారు? 2014 నుంచి 2019 వరకు ఎంత ఖర్చు చేశారు? సిఎం జగన్ హయాంలో ఎంత ఖర్చు చేశారో స్పష్టం చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టు నిర్మాణ వ్యయంలో అనేక అవినీతి అక్రమాలు జరిగాయని ఆరోపించారు. తెలంగాణ కాళేశ్వరం ప్రాజెక్టు మీద విచారణ చేపట్టారని, పోలవరం ప్రాజెక్టు మీద కూడా న్యాయ విచారణ చేయాలని కోరారు. ఇప్పటి వరకు సుమారుగా రూ.40 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటారని, ఇప్పటికే నిర్మాణం పూర్తయి ఉండాలని పేర్కొన్నారు. గత నలుగురు సిఎంల హయాంలో ఎంత ఖర్చు చేశారన్నది వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా కాంగ్రెస్ నాయకులు జి.సూర్యారావు పాల్గొన్నారు.



ఆదినాథ్ శ్రీగురు మహావతార్ విగ్రహావిష్కరణలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

బాబాజీ ఆలయాన్ని ప్రారంభించిన గడ్కరీ

ప్రజాశక్తి- మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలోని సత్సంగ్ ఫౌండేషన్ ఆవరణలో బుధవారం ఆదినాథ్ శ్రీగురు మహావతార్ బాబాజీ ఆలయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఫౌండర్ పద్మశ్రీ అవార్డు గ్రహీత ముంతాజ్‌అలీ ప్రారంభించారు. కార్యక్రమంలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి ప్రసాద్‌రెడ్డి, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాష, ఎస్‌పి విద్యా సాగర్ నాయుడు, బిజెపి నేతలు పాల్గొన్నారు.

చిప్పిలికి చేరుకున్న మంత్రి గడ్కరికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. మంత్రి మండిపల్లి, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కేంద్ర మంత్రిని కలిసి అన్నమయ్య జిల్లా రహదారి ప్రాజెక్టులు త్వరితగతిన పూర్తి చేసి, జిల్లా అభివృద్ధి బాటలు వేయాలని కోరారు.

బజాజ్ ఎలక్ట్రికల్స్ సిఇఒ అనూజ్ రాజీనామా

న్యూఢిల్లీ : బజాజ్ ఎలక్ట్రికల్స్ ఎండి, సిఇఒ అనూజ్ పొద్దార్ అర్ధంతరంగా తన పదవికి రాజీనామా చేశారు. సెప్టెంబర్ 30న ఆయన పదవి నుంచి వైదొలగుతారని ఆ కంపెనీ వెల్లడించింది. ఈ కాలంలో అనూజ్ బాధ్యతలను కంపెనీ ఛైర్మన్ శేఖర్ బజాజ్ చూడనున్నారు. బజాజ్ ఎలక్ట్రికల్స్‌ను 2022 మార్చిలో మొదటి సారిగా నికర రుణ రహితంగా మార్చడంలో అనూజ్ కృషి చేశారు. కంపెనీ ఆర్అండ్‌డి సామర్థ్యాలను మెరుగు పర్చడంలో కీలక బాధ్యతలు తీసుకున్నారు. ఐదున్నరేళ్లుగా సిఇఒ బాధ్యతలను చూస్తున్న అనూజ్ రాజీనామాను ఆ కంపెనీ బోర్డు ఆమోదించింది. కంపెనీకి ఆయన చేసిన సేవలు ప్రశంసనీయమని శేఖర్ బజాజ్ పేర్కొన్నారు.



డిఎస్‌సి-98 అభ్యర్థులకు న్యాయం చేయండి

- మంత్రి లోకేష్‌కు కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

డిఎస్‌సి-98 రిక్రూట్‌మెంట్ సందర్భంగా గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకపోవడంతో అర్హులైన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీ అభ్యర్థులకు తీవ్రమైన అన్యాయం జరిగిందని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ.. మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లారు. కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ తరపున రాష్ట్ర అధ్యక్షులు ఓ నల్లప్ప, అండ్ర మల్యాద్రి బుధవారం లోకేష్‌కు మెయిల్ ద్వారా వినతిని పంపారు. మొత్తం 4,534 డిఎస్‌సి-98 అభ్యర్థులుంటే కేవలం 3,882 మంది చేరారని, మిగిలిపోయిన 1,852 మందికి కూడా తక్షణం పోస్టింగు ఇవ్వాలని కోరారు.

గత ప్రభుత్వం రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించకుండా అన్నీ ఓపెన్ కేటగిరీలో భర్తీ చేయడం వల్ల ఎస్‌సి, ఎస్‌టి, వికలాంగ, మైనార్టీ తరగతుల అభ్యర్థులకు తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని తక్షణం డిఎస్‌సి-98 అభ్యర్థులందరికీ పోస్టింగు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సంపాదకీయం

ధరల మంట

కేంద్ర ప్రభుత్వం చెప్పే మాటలు ఎలా ఉన్నప్పటికీ, సామాన్య ప్రజానీకంపై తీవ్ర ప్రభావం చూపే నిత్యావసర వస్తువుల ధరలు ఏ మాత్రం తగ్గడం లేదు. తాజాగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన గణాంకాల్లోనూ ఆహార ద్రవ్యోల్బణం పైపైకి ఎగబాకు తుండటం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ గణాంకాల ప్రకారం టోకు ధరల ద్రవ్యోల్బణం జూన్ నెలలో 16 నెలల గరిష్ట స్థాయికి చేరింది. దీనిలో అధిక వాటా ఆహార ధరలదే కావడం గమనార్హం. ఈ స్థాయిలో హోల్‌సేల్ మార్కెట్లో ధరల పెరుగుదలపై ఆర్థిక రంగ నిపుణులు సైతం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిజానికి, మోడీ ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలోనూ ధరలను అదుపు చేయడానికి చేసిందేమీ లేదు. కరోనా సమయంలోనూ, ఆ తరువాత కూడా కార్పొరేట్ల సేవలో మునిగి తేలడంతో 2023 సంవత్సరంలో ఆహార ద్రవ్యోల్బణం మొదటిసారి 8 శాతం దాటింది. ఎన్నికల ముందు ధరలను అదుపు చేస్తున్నట్లు, ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చినట్లు తిమ్మిని బమ్మి చేసే ప్రచారాన్ని చేపట్టినప్పటికీ అది అవాస్తవమని తేలిపోయింది. ఇక అట్టహాసంగా చెప్పుకుంటున్న మోడీ 3.0 ప్రభుత్వ హయాంలోనూ గత విధానాలే కొనసాగుతున్నాయని చెప్పడానికి తాజా గణాంకాలే నిదర్శనం. మూడవ సారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ బాధ్యతలు చేపట్టి నెల రోజులు దాటింది. ఈ నెల రోజుల పాలనలో ఆయన గానీ, ఆయన మంత్రి వర్గ సహచరులు గానీ ప్రజానీకపు మూలుగలను పీల్చి పిప్పి చేస్తున్న ధరాభారంపై కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల వరుసగా నాలుగు నెలల పాటు టోకు ధరల సూచీ పైపైకి ఎగబాకి మే నెలలో 2.61 శాతానికి చేరుకుంది. జూన్ నెలలో ఏకంగా 16 నెలల గరిష్ట స్థాయి 3.36 శాతానికి పెరిగింది. ఆహార ధరల ద్రవ్యోల్బణం 10.87 శాతానికి చేరింది. తాజా గణాంకాల ప్రకారం జూన్ నెలలో ధరలు 93.35 శాతం పెరిగాయి. బంగాళాదుంపలు 66.37, కూరగాయలు 38.76, తృణ ధాన్యాలు 9.27, పండ్లు 10.14, గోధుమలు 6.25 శాతం చొప్పున ధరలు పెరిగాయి. పప్పుల ధరలు కొంత తగ్గినట్టు కనిపిస్తున్నప్పటికీ అంతకు ముందు అవి పెరిగిన దానితో పోల్చుకుంటే ఈ తగ్గుదల నామమాత్రమే.

తయారీ రంగంలోనూ జూన్ నెలలో టోకు ధరలు మరింత పెరిగాయి. మే నెలలో 0.78 శాతంగా ఉన్న తయారీ రంగ టోకు ద్రవ్యోల్బణం జూన్ నెలలో 1.43 శాతానికి పెరిగింది. ఇది భారీ పెరుగుదలగా నిపుణులు విశ్లేషిస్తున్నారు. కలప వస్తువులు 3.17 శాతం, రబ్బరు 1.34 శాతం, ప్రాథమిక లోహాలు 1.06 శాతం పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. అదేవిధంగా ఫ్యాక్టరీలలో తయారు చేసే ఆహార ఉత్పత్తులు 4.28 శాతం, పానీయాలు 2.07 శాతం పెరిగాయి. వివిధ అంతర్జాతీయ పరిణామాల కారణంగా తయారీ రంగంలో ధరల పెరుగుదల మరికొంత కాలం కొనసాగే అవకాశం ఉందని అంచనాలు వెలువడుతున్నాయి.

టోకు ధరల్లో చోటు చేసుకుంటున్న ఈ పెరుగుదల ప్రభావం రిటైల్ మార్కెట్‌పై మరింత ఎక్కువగా పడనుంది. ఒక అధ్యయనం ప్రకారం రాబోయే రోజుల్లో సామాన్య ప్రజానీకం మరింత తీవ్రంగా ధరాఘాతానికి గురికానున్నారు. రెండు రోజుల క్రితం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన నివేదికలో రిటైల్ ద్రవ్యోల్బణం రానున్న కొన్ని నెలల పాటు దేశ వ్యాప్తంగా సగటున సుమారు 5 శాతం ఉంటుందని పేర్కొంది. దేశమంతా విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న అంచనా ఆధారంగా ఎస్‌బిఐ ఈ నిర్ధారణ చేయడం గమనార్హం. వేసవిలో పండిన ఆహార ఉత్పత్తులే ప్రస్తుతం మార్కెట్లోకి వస్తున్నాయని అందువల్ల ఆగస్టు నెలాఖరు వరకు ఆహార ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చే అవకాశం లేదని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. వర్షాలు విస్తారంగా పడి, వర్షాకాలపు పంటలు, కూరగాయలు విరివిగా మార్కెట్‌లోకి వస్తే ఈ పరిస్థితి మారుతుందని ఆ వర్గాలు అంటున్నాయి. అయితే, వాతావరణ శాఖ గణాంకాల ప్రకారం జులై 17వ తేది (బుధవారం) నాటికి దేశ వ్యాప్తంగా 11 వాతావరణ సబ్ డివిజన్లలో తక్కువ వర్షపాతం నమోదైంది. 20 నుండి 59 శాతంగా ఈ తగ్గుదల నమోదైంది. ఆహారపంటలు పండించే పంజాబ్ వంటి రాష్ట్రంలోనూ వర్షపాతం తక్కువగా ఉంది. అంటే భవిష్యత్‌లోనూ ధరల మంట తప్పని స్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ధరలను అదుపు చేయడానికి ప్రభుత్వాలు అనుసరించే విధానాలే కీలకం. కార్పొరేట్లకు పెద్దపీట వేసే మోడీ ప్రభుత్వాన్ని ప్రజా ఉద్యమాలతోనే ఆ దిశలో నడిపించగలం!

మహనీయుల మాట



ఎంత గొప్ప స్థానానికి చేరినా సరే విద్యార్థిగానే వుండు. అది నిన్ను మరింత ఉన్నత స్థానానికి తీసుకెళుతుంది.

- డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్, పూర్వ రాష్ట్రపతి.

ఉప ఎన్నికల్లో బిజెపికి భారీ పాఠాలు

- పీపీ

విశ్లేషణ

ఇటీవల జరిగిన ఉప ఎన్నికల్లో ఘోరంగా దెబ్బతినడం మోడీ ప్రభుత్వానికి, బిజెపి ఆరెస్సెస్ పరివారానికి కూడా రాజకీయంగా పెద్ద షాక్‌గా మారింది. ఆ స్థానాలు అత్యధికం ఆ యా పార్టీలవేననే వాదనతో సమర్థించుకోవడం సాధ్యపడటం లేదు. ఎందుకంటే తమ పాలనలోని రాష్ట్రాలలోనూ మరింత దారుణంగా ఓడిపోయారు. సాధారణంగా శాసనసభ ఎన్నికలకూ లోక్‌సభకూ తేడా వుంటుందని చెబుదామంటే ఈ నెల రోజుల వ్యవధిలోనే బిజెపి ఓటింగ్ గణనీయంగా తగ్గిపోయింది. అంటే మళ్లీ అధికారంలోకి రావడం ప్రభావం ఏమీ లేదని తేలింది. పైగా ఈ నెల రోజులలోనూ వ్యవహరించిన తీరు వ్యతిరేకత ఇంకా పెంచినట్లు ఓట్ల వివరాలు చెబుతున్నాయి. అనేక రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు వస్తున్న తరుణంలో ఇలా జరగడం ఆ పార్టీ నేతలను మరీ భయపెడుతున్నది.

పదమూడు శాసనసభ నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగితే బిజెపికి రెండు మాత్రమే దక్కాయి. ఒకటి మధ్యప్రదేశ్, మరొకటి హిమాచల్ ప్రదేశ్. కాంగ్రెస్‌కు హిమాచల్‌లో రెండు, ఉత్తరాఖండ్‌లో రెండు వచ్చాయి. తృణమూల్ కాంగ్రెస్ పశ్చిమ బెంగాల్‌లో నాలుగు సీట్లు గెల్చుకోగలిగింది. డిఎంకె తమిళనాడులో, ఆమ్ ఆద్మీ పార్టీ పంజాబ్‌లో చెరొకటి నిలబెట్టుకోగా బీహార్‌లో స్వతంత్ర అభ్యర్థి పాలక జెడియు ను ఓడించారు. అంటే ఎన్డీయేగా కూడా ఓటమి తప్పలేదు. 2019 నాటి బలం బాగా తగ్గి 240 స్థానాలకు చేరిన బిజెపి దీంతో మరింత దిగులులో కూరుకుపోయింది. అయితే అందులో మూడు మాత్రమే తమ సిటింగ్ సీట్లు గనక పెద్ద విచారమేముందని మేకపోతు గాంభీర్యం వెలగబెట్టే ప్రయత్నం చేసింది. బెంగాల్ లో తృణమూల్ దౌర్జన్యాన్ని కారణంగా చూపింది. ఇవన్నీ ఏమైనా నలభై రోజులలోనే ఈ మలి విజయంతో 'ఇండియా' వేదిక నూతనోత్సాహం పొందింది.


అప్పటికన్నా ఓట్ల తగ్గుదల

శాసనసభ ఉప ఎన్నికల్లో స్థానిక అంశాల ప్రభావం మాత్రమే వుంటుందని ఓ వాదన. ఉదాహరణకు బీహార్ లోని రూపాలిలో ఇండిపెండెంట్ అభ్యర్థి రాజ్‌పుత్ బాహుబలి శంకర్ సింగ్ బలీయమైన ఆర్జేడీ, జెడియు లను రెంటినీ ఓడించారు. తమిళనాడులో అయితే ఉప ఎన్నికల్లో పాలక పార్టీలే గెలవడం పరిపాటి. తృణమూల్ దౌర్జన్యం కథనాలలోనూ నిజం లేకపోలేదు. ఇలా ఎక్కడికక్కడ ఏం చెప్పుకున్నా ఒక ఉమ్మడి అంశంగా కనిపించింది బిజెపిపై విముఖతే. పోలింగ్ తర్వాత రెండు నెలల్లోనే బిజెపి ఎన్డీయే బలం తగ్గ ముఖం పట్టగా 'ఇండియా' పుంజుకోవడం స్పష్టం.

లోక్‌సభ ఎన్నికల్లో వీటిలోని 11 నియోజక వర్గాలలో బిజెపి సగటున యాభై శాతం ఓటింగ్ పొందింది. ఇప్పుడది కేవలం 35 శాతానికి తగ్గింది. ఒక్క ఉత్తరాఖండ్ లోని మంగళూర్‌లో మాత్రమే కాంగ్రెస్ గట్టి పోటీలో బయట పడింది. హిమాచల్ లోని హమిర్‌పూర్, మధ్యప్రదేశ్‌లో ఎస్టీ నియోజకవర్గమైన అమర్వారాలో బిజెపి యే గెలిచినా లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఓటింగ్ మాత్రం 12.5, 3.1 శాతం తగ్గింది. బెంగాల్‌లో 20 శాతం ఓట్లు తగ్గడానికి మమత సర్కారు నిర్బంధం కారణమని భావించినా సగటున మొత్తం మీద 20 శాతం ఎందుకు తగ్గినట్టు? ఈ తగ్గుదల పంజాబ్, హిమాచల్ లోని సీట్లకూ వర్తిస్తుంది.

ఇందుకు భిన్నంగా కాంగ్రెస్ విషయం తీసుకుంటే పోటీకి దిగిన ఏడు స్థానాల్లో ఓట్లు పెంచుకుంది. అలాగే దాని మిత్రులైన 'ఇండియా' పార్టీలు కూడా. బిజెపి మిత్రులలో

> లోక్‌సభ ఎన్నికల తర్వాత నెలలోనే ఎందుకింతగా ఓట్లు తగ్గిపోయాయనే ప్రశ్న కూడా బిజెపి వర్గాలను రాజకీయ పరిశీలకులను ఆలోచింపచేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 63 స్థానాలు కోల్పోయినా మోడీ బృందం వైఖరిలో మార్పు లేకపోవడం ఆ పార్టీ వారే జీర్ణించుకోలేకపోతున్నారు. పార్లమెంటులో కాస్తయినా వాస్తవికత లేకుండా గతంలో వలెనే ప్రతిపక్షాన్ని చులకన చేయాలని ఏకపక్షంగా మాట సాగించుకోవాలని పాకులాడటం ప్రజలు ఆమోదించలేదు. తమ తీర్పును కాస్తయినా గౌరవించకుండా మోడీ మార్కు నిరంకుశత్వాన్ని సాగించడంపై గుణపాఠం చెప్పాలని గట్టిగా భావించారు గనక ఈ తరహా పాఠం నేర్పించారన్న పరిశీలకుల మాట నిజమే కావచ్చు.



> ఈ దెబ్బతో ఫిరాయింపుల ద్వారా పెత్తనం చేయొచ్చనే నమ్మకం బిజెపి నేతలలో సడలిపోయింది. గతంలోనైతే కర్ణాటక, ఎం.పి, ఇలా చాలా చోట్ల టోకున ఫిరాయింపులకు పాల్పడి తర్వాత ఉప ఎన్నికలలో వాటిని గెలిచామని పించుకునేవారు. వరుసగా ఉప ఎన్నికలలో ఇటీవల దెబ్బ తినడం వల్ల ఆ చిట్కా ఇక పారదనే అంచనాకు వస్తున్నారు. మోడీకి కూడా మెజార్టీ రాకున్నా రెండు మూడు నెలల్లో ఎలాగో ప్రతిపక్షాల నుంచి రాబడతారన్నట్టు వారు మాట్లాడేవారు. అయితే ఇప్పుడా విశ్వాసం కాస్త సన్నగిల్లిపోయింది. అంతేగాక నాయకత్వం ఏది చెప్పినా తలూపబోమంటూ అడ్డం తిరుగుతున్నారట. అలాగే పార్టీ వ్యవహారాలు, అభ్యర్థులు, పోటీలు అన్నీ మోడీ అమిత్ షాలకే వదిలేయడమనే ఆరెస్సెస్ వైఖరి కూడా కొంత మారిందని చెబుతున్నారు.

జెడియు మాత్రమే కాదు. తమిళనాడులో పీఎంకే కూడా వెనకబడిపోయింది. అన్నా డిఎంకె రంగంలో లేకున్నా ఆ మేరకు పుంజుకోలేకపోయింది. అంటే బిజెపి ఎన్డీయే పార్టీలు వెనకబడి పోగా కాంగ్రెస్ 'ఇండియా' పార్టీలకు సానుకూలత పెరిగింది. ఇదే ఈ తొలి ఉప ఎన్నికల సందేశమైంది. దాంతో ఇప్పటి వరకూ నీరసపడిన కాంగ్రెస్‌లో ఊహించని కొత్త ఉత్సాహం పెరిగినట్టయింది. లోక్‌సభ ఎన్నికల ఫలితానికి ఒక కీలక స్థానంగా నిలిచిన ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్వయంగా...ఓటమికి దారితీసిన కారణాలపై మాట్లాడవలసి వచ్చింది. అతి విశ్వాసం దెబ్బ తీసిందని ఆయన అంటుంటే అభ్యర్థుల ఎంపికతో సహా అనేక పెడ ధోరణులు మనల్ని ఓడించాయని బిజెపి సీనియర్లు చాలా మంది పెదవి విరిచారు. అద్వానీ మార్గానికి తిరిగి వెళ్లాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ గోవాలో అన్నారు.

తగ్గిన విధేయత

ఉత్తరాఖండ్‌లో ఉప ఎన్నికల ఓటమి తర్వాత మాజీ ముఖ్యమంత్రి తీర్థసింగ్ రావత్ మాట్లాడుతూ టికెట్ల పంపిణీలో లోపాలే ఓడించాయని వ్యాఖ్యానించారు. ఆయనను కాదని అనిల్ బలూనీకి టికెట్ ఇవ్వడం రావత్‌కు మింగుడు పడలేదు. అయోధ్యలోనే ఓడిపోవడం వారణాసిలో మోడీ ఆధిక్యత బాగా తగ్గడం బిజెపిని నైతికంగా బాగా దెబ్బ తీసింది. వాస్తవానికి బిజెపి అధిష్టానం పట్టు కొంత తగ్గడానికి ఉప ఎన్నికలు కూడా కారణమైనాయి. ఫిరాయింపుల అభ్యర్థులలో అత్యధికులు ఓడిపోయారనేది సాధారణ అభిప్రాయంగా తయారైంది. ఉదాహరణకు మొన్నటి లోక్‌సభ ఎన్నికలలో 110 మంది ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని అభ్యర్థులుగా పెడితే వారిలో 69 మంది ఓటమిపాలయ్యారు. అంటే 62 శాతం అన్నమాట. ఉప ఎన్నికలలోనైతే అలాంటి ఆరుగురిలో నలుగురు ఓడిపోయారు. మధ్యప్రదేశ్‌లో ముగ్గురిలో ఇద్దరు ఓడిపోయారు. గెలుపొందిన ఆశిష్ శర్మ కూడా స్వల్ప ఆధిక్యతతోనే బయటపడ్డారు. బద్రీనాథ్‌లోనూ విజయం సాధించిన కాంగ్రెస్ అభ్యర్థి ఓట్ల శాతం 48 శాతం నుంచి 52 శాతానికి పెరిగింది. ఈ దెబ్బతో ఫిరాయింపుల ద్వారా పెత్తనం చేయొచ్చనే నమ్మకం బిజెపి నేతలలో సడలిపోయింది. గతంలోనైతే కర్ణాటక, ఎం.పి, ఇలా చాలా చోట్ల టోకున ఫిరాయింపులకు పాల్పడి తర్వాత ఉప ఎన్నికలలో వాటిని గెలిచామనిపించుకునేవారు. వరుసగా ఉప ఎన్నికలలో ఇటీవల దెబ్బ తినడం వల్ల ఆ చిట్కా ఇక పారదనే అంచనాకు వస్తున్నారు. మోడీకి కూడా మెజార్టీ రాకున్నా రెండు మూడు నెలల్లో ఎలాగో ప్రతిపక్షాల నుంచి రాబడతారన్నట్టు వారు మాట్లాడేవారు. అయితే ఇప్పుడా విశ్వాసం కాస్త సన్నగిల్లిపోయింది. అంతేగాక నాయకత్వం ఏది చెప్పినా తలూపబోమంటూ అడ్డం తిరుగుతున్నారట. అలాగే పార్టీ వ్యవహారాలు, అభ్యర్థులు, పోటీలు అన్నీ మోడీ అమిత్ షాలకే వదిలేయడమనే ఆరెస్సెస్ వైఖరి కూడా కొంత మారిందని చెబుతున్నారు.

మారని మోడీపై ఆగ్రహమేనా?

పాలక పార్టీ ఈ విధంగా డీలా పడిపోతుంటే కాంగ్రెస్‌తో కలసి సమాజ్‌వాది పార్టీ ఉగ్రూతలూగుతున్నది. ఈ ఏడాది చివరలో యు.పి లో పది ఉప ఎన్నికలు రావలసి వుంది. లోక్‌సభకు ఎన్నికైన నేతల రాజీనామాల కారణంగా ఈ ఉప ఎన్నికలు రాబోతున్నాయి. వీటిలో అయిదు ఎస్‌పికి సంబంధించినవి కాగా మూడు చోట్ల బిజెపి ప్రాతినిధ్యం వహిస్తుండేది. ఆ పార్టీ మిత్ర పక్షాలైన ఆర్‌ఎల్‌డి, నిషద్ పార్టీలలో చెరో స్థానంలో వుండేవి. వీటిలో ఎవరు ఎన్ని పోటీ చేయాలనే దానిపై ఇరు పార్టీల మధ్యలో ఇంకా అవగాహన పూర్తికాలేదు గానీ ఒకటిగా పోటీ చేయాలని మాత్రం గట్టి అంగీకారం వుంది. ఈ స్థానాలు ఖాళీగా వున్నట్టు జూన్ 7, 8 తేదీలలోనే ప్రకటించినా ఎన్నికల సంఘం ఉప ఎన్నికల కార్యక్రమం ఇంకా ఖరారు చేయవలసి వుంది. ఈ ఏడాది చివరలో వచ్చే మహారాష్ట్ర, హర్యానా అసెంబ్లీ ఎన్నికలతోపాటు ఈ ఉప ఎన్నికలు పెడతారనే అంచనా వుంది. కణోజ్ నుంచి లోక్‌సభకు గెలుపొందిన అఖిలేశ్ యాదవ్ అంతకు ముందు ప్రాతినిధ్యం వహించిన కర్హాల్ (మైన్‌పురి) కూడా వీటిలో ఒకటి. ఇప్పుడున్న వాతావరణంలో ఉప ఎన్నికల ఫలితాలు తప్పక తమకు అనుకూలంగా వుంటాయని 'ఇండియా' భాగస్వాములైన ఎస్.పి, కాంగ్రెస్ విశ్వాసంతో వున్నాయి. వీటన్నిటి ప్రక్రియ పూర్తి కావాలంటే కొంతకాలం ఆగవలసిందే.

లోక్‌సభ ఎన్నికల తర్వాత నెలలోనే ఎందుకింతగా ఓట్లు తగ్గిపోయాయనే ప్రశ్న కూడా బిజెపి వర్గాలను రాజకీయ పరిశీలకులను ఆలోచింపచేస్తున్నది. లోక్‌సభ ఎన్నికల్లో ఏకంగా 63 స్థానాలు కోల్పోయినా మోడీ బృందం వైఖరిలో మార్పు లేకపోవడం ఆ పార్టీ వారే జీర్ణించుకోలేకపోతున్నారు. పార్లమెంటులో కాస్తయినా వాస్తవికత లేకుండా గతంలో వలెనే ప్రతిపక్షాన్ని చులకన చేయాలని, ఏకపక్షంగా మాట సాగించుకోవాలని పాకులాడటం ప్రజలు ఆమోదించలేదు. తమ తీర్పును కాస్తయినా గౌరవించకుండా మోడీ మార్కు నిరంకుశత్వాన్ని సాగించడంపై గుణపాఠం చెప్పాలని గట్టిగా భావించారు గనక ఈ తరహా పాఠం నేర్పించారన్న పరిశీలకుల మాట నిజమే కావచ్చు.

ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయి నిర్మూలన

సమస్య

విశాఖ సెంట్రల్ జైలు కెపాసిటి 1200 మంది కాగా, అక్కడ 2000 మంది ఖైదీలు వున్నారు. అందులో 1200 మంది...గంజాయి కేసుల్లో అరెస్టయిన అమాయక గిరిజనులే. దీనిని బట్టే గంజాయిని ఏ స్థాయిలో పండించి ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారో అర్థమౌతుంది.

ఆంధ్ర రాష్ట్ర ఎన్నికల సందర్భంగా గంజాయి అంశం ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చింది. ఎన్నికల అనంతరం గంజాయి మీద యుద్ధం పేరుతో కొత్తగా ఏర్పడిన రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల ప్రణాళిక ప్రకటించింది. గత ప్రభుత్వం కూడా ఇదే గంజాయిపై యుద్ధం ప్రకటించి ఏజెన్సీలో పెద్ద ఎత్తున గంజాయి తోటలు నరికి కుప్పలు వేసి తగలబెట్టినా...తరువాత ఆ విషయాన్నే విస్మరించింది. నేటి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రణాళికను పక్కాగా అమలు చేసి గంజాయిని నియంత్రించే విధంగా కార్యాచరణ వుండాలి.

మాదక ద్రవ్యాల మత్తుకు యువత బానిస అవుతోంది. దీనిని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. స్వయానా కేంద్ర హోం మంత్రి అమిత్ షా 2022 డిసెంబర్‌లో ఇదే విషయాన్ని ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే ఏకోన్ముఖంగా మాదక ద్రవ్యాలను నియంత్రించడంలో చిత్తశుద్ధి ప్రదర్శించాలి. దానికి కావాల్సిన ప్రణాళికను సిద్ధం చేసి ప్రజలను భాగస్వాములను చేయాలి. డ్రగ్స్ మాఫియాపై ఉక్కుపాదం మోపాలి.



కె.లోకనాథం

మాదక ద్రవ్యాల ముఠాలు అంతర్ రాష్ట్రాలకు సంబంధించినవి. పాలకుల ఉదాసీనత కారణంగా అవి తమ పనులను యథేచ్ఛగా చేసుకుపోతున్నాయి. కట్టడి చేయాల్సిన ప్రభుత్వ యంత్రాంగం కఠినంగా వ్యవహరించకపోవడంతో వాటి వ్యాపార సామ్రాజ్య విస్తరణకు అడ్డు అదుపు లేకుండా పోతున్నది.

గంజాయి పంటను ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దు ప్రాంతంలో పండిస్తున్నారు. అంతర్ రాష్ట్ర గంజాయి ముఠాలు విత్తనాల సప్లయి, పెట్టుబడులు, వ్యాపారానికి సంపూర్ణ సహకారం అందిస్తున్నాయి. పాలకులు చిత్తశుద్ధితో, గిరిజన ప్రజల భాగస్వామ్యంతోనే గంజాయిని అరికట్టడం సాధ్యమౌతుంది.

> గంజాయి పంటలు లేకుండా చేయాలంటే ప్రభుత్వం ప్రకటించిన కార్యాచరణలో అమాయక గిరిజనులను సంపూర్ణ భాగస్వాములను చేయాలి. గంజాయి పండిస్తున్న చోట ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి. సాగుకు కావాల్సిన విత్తనాలు ఇవ్వాలి. పంటలకు నీరు అందించాలి. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్ సౌకర్యం కల్పించాలి. ఇవి జరగాలంటే గ్రామ స్థాయిలో వ్యవసాయ, హార్టీకల్చర్, సెరికల్చర్ వంటి శాఖలన్నింటిని అనుసంధానం చేయాలి. యువతకు ఉపాధి మార్గాలు కల్పించాలి. ఐ.టి.డి.ఎ సంస్థ దీనిని ప్రత్యేక సామాజిక అంశంగా తీసుకొని చిత్తశుద్ధితో వ్యవహరిస్తే పరిష్కార మార్గాలు లభిస్తాయి.



గంజాయి సమస్య సామాజిక సమస్య. దీని మూలంగా అమాయక గిరిజనులు తమ బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారు. ప్రశాంతమైన ఏజెన్సీ ప్రాంతంలో ఎందుకు గంజాయి వైపు వెళ్తున్నారు? ఒకవైపున గిరిజన ప్రాంతంలో పండిస్తున్న కాఫీ పంటను జాతీయ, అంతర్జాతీయ సంస్థలు కీర్తిస్తున్నాయి. మరొకవైపు ప్రకృతి వ్యవసాయానికి ఈ ప్రాంతం కేంద్ర బిందువుగా వుండేది. ఇక్కడ మిరియాలు, పసుపు, అపరాలు, వలెసలు వంటివి పండించుకొని జీవించేవారు. అలాంటి ప్రశాంతమైన ప్రాంతంలో అమాయక గిరిజనులు సాగు చేస్తున్న గంజాయి వైపు ఎందుకు వెళ్తున్నారో కారణాలు విశ్లేషించాలి.

ఏజెన్సీలో ప్రతి ఏడాది గంజాయి సాగు విస్తీర్ణం పెరుగుతున్నది. సుమారు 15 వేల ఎకరాలలో గంజాయి సాగు అవుతున్నదని అధికారులు చెబుతున్నారు. తక్కువ శ్రమతో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చన్న ఆశ చూపి అటు వైపు మళ్ళించడం జరుగుతున్నది. వేల ఎకరాల సాగుకు పెట్టుబడులు ఎక్కడి నుండి వస్తున్నాయన్నది పెద్ద ప్రశ్న. గంజాయి పౌడర్, లిక్విడ్, చాక్లెట్ రూపంలో అమ్ముడవుతున్నది. గంజాయిని గిరిజనుల దగ్గర తక్కువ ధరలకు కొనుగోలు చేసి వ్యాపారులు కోట్లాది రూపాయల లాభాలు ఆర్జిస్తున్నారు. గంజాయి అమ్మకాల్లో గిరిజన యువతను ఉపయోగించుకుంటున్నారు. డబ్బుకు ఆశపడి నిరుద్యోగ యువత పోలీసులకు అడ్డంగా దొరికి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. పోర్టు, రైల్వే, బస్సు, కారు, మోటారు బైక్‌ల మీద రవాణా అవుతున్నాయి. పుట్టిన రోజు వేడుకల నుండి పబ్బుల వరకు ఈ మహమ్మారి విస్తరించింది. చిన్నపిల్లల నుండి వృద్ధుల వరకు దీనికి బానిసలవుతున్నారు. వీటిని రవాణా చేసే విలాసవంతమైన వాహనాల నుండి సాధారణ వాహనాల వరకు సీజ్ చేయడంతో అవి పోలీస్ స్టేషన్లలో మగ్గుతున్నాయి. చివరికి అంతర్ రాష్ట్ర ముఠాల మధ్య తుపాకీ కాల్పులు జరిగిన ఉదంతాలు కూడా వున్నాయి. దాదాపు 25 వేల కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోందని అంచనా. ఎకరాకు 4000 మొక్కలు వేస్తే 1000 కిలో గంజాయి వస్తోంది. రూ. 5 లక్షల పెట్టుబడి పెడితే రూ. 50 లక్షలు వరకు లాభాలు వస్తున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

1961లో నార్కోటిక్ డ్రగ్స్‌పై జరిగిన సమావేశంలో భారత ప్రభుత్వం కూడా...గంజాయి పంట సాగును కూడా ఒక నేరంగా చూడాలని పేర్కొంది. అందులో భాగంగానే 1985లో హెరాయిన్, కొకైన్, గంజాయి పంటలను మాదక ద్రవ్య నియంత్రణ చట్టం పరిధి లోకి (ఎన్‌డిపిఎస్) తీసుకొచ్చారు. ఉత్పత్తి, రవాణా, అమ్మకం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఇందులో సెక్షన్ 20 ప్రకారం అక్రమంగా సాగు చేస్తే 10 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా చెల్లించాలి. ఈ మాదక ద్రవ్యాల నియంత్రణ చట్టం సాధారణ గిరిజనులకు తెలియకపోవడంతో ఆ చట్టంలో అనేక సెక్షన్లను ఉపయోగించి అమాయక గిరిజనులు జైలు పాలౌతున్నారు. డబ్బు ఉన్న బడా బాబులు మాత్రం హైకోర్టుకి వెళ్ళి బెయిల్ తీసుకొని దర్జాగా తిరుగుతున్నారు. ఇదే వ్యాపారంలో స్థిరపడి విస్తరిస్తున్నవారు కూడా వున్నారు. దేశంలో ఒక్క ఉత్తరాఖండ్‌లో మాత్రమే గంజాయిని ప్రభుత్వ షరతులతో సాగు చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్, జమ్ము కాశ్మీర్, మణిపూర్ రాష్ట్రాల్లో పరిశోధన అవసరాల కోసం స్వల్ప విస్తీర్ణంలో గంజాయి సాగుకు అనుమతులున్నాయి. ఏ అనుమతులు లేని ఆంధ్ర రాష్ట్రంలో విచ్చలవిడిగా సాగు జరుగుతు న్నదంటే...వ్యాపారులు, రాజకీయ నాయకులు, ప్రభుత్వ యంత్రాంగం మద్దతుతోనే సాధ్యమని ప్రజల్లో నానుడి. ఇది ఒక్క రోజులో అయింది కాదు. సంవత్సరాల తరబడి ప్రభుత్వాలు ఉదాసీనంగా వుండడం వలన వేలాది ఎకరాలకు గంజాయి విస్తరించింది. ప్రజలకు అవగాహన కల్పించి స్వచ్ఛందంగా గంజాయి సాగుని అరికట్టాలి. సమగ్ర దృక్పథంతో ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతోనే గంజాయి సాగు నియంత్రణ సాధ్యం. ప్రభుత్వం ప్రకటించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి.

గంజాయి పంటలు లేకుండా చేయాలంటే ప్రభుత్వం ప్రకటించిన కార్యాచరణలో అమాయక గిరిజనులను సంపూర్ణ భాగస్వాములను చేయాలి. గంజాయి పండిస్తున్న చోట ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లించాలి. సాగుకు కావాల్సిన విత్తనాలు ఇవ్వాలి. పంటలకు నీరు అందించాలి. పండిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి మార్కెట్ సౌకర్యం కల్పించాలి. ఇవి జరగాలంటే గ్రామ స్థాయిలో వ్యవసాయ, హార్టీకల్చర్, సెరికల్చర్ వంటి శాఖలన్నింటిని అనుసంధానం చేయాలి. యువతకు ఉపాధి మార్గాలు కల్పించాలి. ఐ.టి.డి.ఎ సంస్థ దీనిని ప్రత్యేక సామాజిక అంశంగా తీసుకొని చిత్తశుద్ధితో వ్యవహరిస్తే పరిష్కార మార్గాలు లభిస్తాయి.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

జనవాక్యం

వృద్ధులకు రైల్వే రాయితీలు

కోవిడ్ లాక్‌డౌన్‌కు ముందు, 2020 మార్చిలో భారతీయ రైల్వే సీనియర్ సిటిజన్లు, ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులకు రైలు ఛార్జీలపై 50 శాతం రాయితీని అందించింది. కోవిడ్ మహమ్మారి సమయంలో అన్ని రకాల రాయితీలను రైల్వే శాఖ తొలగించింది. కరోనా నుంచి కోలుకుని సాధారణ పరిస్థితులు నెలకొన్నప్పటికీ ఆ రాయితీని మాత్రం కేంద్ర ప్రభుత్వం ఇంకా కొనసాగించలేదు. టికెట్ చార్జీలో పురుషులకు 60 ఏళ్లు దాటితే 40 శాతం డిస్కౌంట్, మహిళలకు 58 ఏళ్లు దాటితే 50 శాతం డిస్కౌంట్ లభించేది. కరోనా మహమ్మారి సమయంలో ఈ డిస్కౌంట్ తొలగించినప్పటి నుంచి తిరిగి రాయితీ ఇవ్వాలనే వినతులు పెరుగుతూ వస్తున్నాయి. ఇప్పుడు 2024 బడ్జెట్ సమీపిస్తుండటంతో గతంలో ఇచ్చిన టికెట్ రాయితీని మరోసారి ఇవ్వాలని సీనియర్ సిటిజన్లు కోరుకుంటున్నారు. సీనియర్ సిటిజన్ల అవసరాలు, ఆర్థిక పరిమాణాలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ఈ అంశంపై నిర్ణయం తీసుకుని చార్జీలలో రాయితీని అమలు చేయాలి.

- అప్పన్న గొనప, విశాఖపట్నం.

బదిలీల షెడ్యూల్

రాష్ట్ర ప్రభుత్వం మెగా డిఎస్సీ-2024 ఉపాధ్యాయుల రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ విడుదల చేయనుంది. రిక్రూట్‌మెంట్ జరిగే లోపు సాధారణ, రిక్వెస్ట్ బదిలీలు జరపాలని అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్పందించి బదిలీల విధానాన్ని, షెడ్యూల్‌ని రూపొందించి డిఎస్సీ-2024 భర్తీకి ముందే బదిలీ ప్రక్రియ పూర్తి చేయాలని విజ్ఞప్తి. ఆంధ్రప్రదేశ్ మోడల్ స్కూళ్లలో డిఎస్సీ-2018 ఉపాధ్యాయులకు బదిలీలు జరపాలి. టీచర్స్ రిక్రూట్మెంట్ జరిగే షెడ్యూల్‌కు ముందుగానే ప్రమోషన్లు కల్పించాలి. బదిలీల కోసం అనేక సంవత్సరాలుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు న్యాయం చేసి ఖాళీలన్నీ చూపి డిఎస్సీ ముందే బదిలీలు జరపాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

- బి. సురేష్, శ్రీకాకుళం జిల్లా.

సవరణ

నిన్నటి ఎడిట్ పేజీలో వచ్చిన వి.శ్రీనివాసరావుగారి వ్యాసం 'సంఘీభావంతోనే సమైక్యత' చివరి కాలమ్‌లో...తమ సొంత రాజకీయ పార్టీని-కమ్యూనిస్టు పార్టీని-వదిలేస్తున్నారు ...అని వుండాలి.

- ఎడిటర్

బెంగుళూరు జిటి మాల్‌లో అన్నదాతకు అవమానం



బెంగుళూరు : దేశంలో అన్నదాతకు మరోసారి అవమానం జరిగింది. ధోతీ ధరించారన్న కారణంతో ఓ రైతును మాల్ సిబ్బంది లోపలికి రానీయలేదు. ఈ అమానవీయ ఘటన బెంగళూరులో చోటుచేసుకుంది. జీటీ మాల్‌లో సినిమా చూసేందుకు ఓ తండ్రీ, కుమారులు వచ్చారు. మాల్‌లోకి వెళ్తుండగా అక్కడి భద్రతా సిబ్బంది ఆ రైతుని అడ్డగించి లోపలికి అనుమతి నిరాకరించారు. ఆ రైతు ధోతీ ధరించి ఉండడమే కారణమని, ప్యాంట్ ధరించి వస్తే లోపలికి అనుమతిస్తామని సిబ్బంది తెలిపారు. మంగళవారం ఈ ఘటన చోటు చేసుకోగా.. బుధవారం ఉదయం మాల్ బయట రైతు సంఘాలు ఆందోళనకు దిగాయి. ఆ రైతుకి, అతడి కుమారుడికి క్షమాపణలు చెప్పాలని వారు డిమాండ్ చేశారు. మాల్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, లేకుంటే వేలాదిమంది రైతులతో ఆందోళనకు దిగుతామని నాయకులు హెచ్చరించారు. దీంతో ఆ భద్రతా సిబ్బంది రైతు, అతడి కుమారుడికి క్షమాపణలు చెప్పారు. కాగా, ఇటీవల బెంగళూరులోని రాజాజీ నగర్ స్టేషన్‌లోనూ ఓ రైతు మురికి దుస్తులు ధరించారని మెట్రో రైలు ఎక్కేందుకు అనుమతి నిరాకరించిన సంగతి తెలిసిందే.

అద్భుత దీపం లేదు: సత్యకుమార్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సంపద సృష్టించడానికి మా వద్ద అల్లావుద్దీన్ అద్భుత దీపమేమీ లేదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి వై సత్యకుమార్ అన్నారు. బుధవారం కేంద్ర వైద్యారోగ్యశాఖ మంత్రి జెపి నడ్డా, కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌ను కలిసి రాష్ట్ర మంత్రి సత్యకుమార్ వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన ఎపి భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మట్లాడారు. 11 టీచింగ్ మెడికల్ కాలేజీలుంటే, ఆరు కాలేజీల్లో మాత్రమే కేటలాగ్స్ ఉన్నాయని, మిగతా ఐదు కాలేజీలకు కేటలాగ్స్ మంజూరు చేయాలని నడ్డాను కోరినట్లు చెప్పారు. సంపద సృష్టించడమనేది దీర్ఘకాలిక ప్రణాళిక అని, అందుకు సమయం పడుతుందని అన్నారు. జీత, భత్యాల కోసమే అప్పులు తప్పటపం లేదని వ్యాఖ్యానించారు. సంపద సృష్టి కోసమే అమరావతి ఔటర్ రింగు రోడ్డు, మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు.

నిరుద్యోగ భారతం



- రెండు వేల ఉద్యోగాలు.. 25 వేల మంది హాజరు
- ముంబయి ఎయిర్‌పోర్టులో తొక్కిసలాట

ముంబయి : దేశంలో నిరుద్యోగ సమస్య ఎంత తీవ్రంగా ఉందో మరోసారి వెల్లడయింది. ముంబయిలోని కలినా ప్రాంతంలో ఎయిర్ ఇండియా ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిన వాక్-ఇన్-ఇంటర్వ్యూలకు భారీగా అభ్యర్థులు తరలిరావడంతో అక్కడ తొక్కిసలాట వంటి పరిస్థితి ఏర్పడింది. వారిని నియంత్రించలేక అధికారులు, పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. దీనికి సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. 2,216 హ్యాండీమాన్ ఖాళీలను భర్తీ చేసేందుకు ముంబయి ఎయిర్‌పోర్టులో మంగళవారం ఎయిర్ ఇండియా రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. కౌంటర్ల వద్ద తమ పత్రాలు సమర్పించేందుకు భారీగా వచ్చిన అభ్యర్థులు ఒకరినొకరు తోసుకోవడం కనిపించింది. ఆహారం, నీరు అందక పలువురు ఇబ్బంది పడ్డారు. కొందరు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఆ ఉద్యోగంలో చేరినవారు విమానం నుంచి లగేజీ దించడం, ఎక్కించడంతోపాటు బ్యాగేజీ బెల్టులను చూసుకోవాలి. ఒక్కో ఎయిర్‌క్రాఫ్ట్‌లో లగేజీ, కార్గోను చూసుకునేందుకు ఐదుగురు లోడర్స్ అవసరం ఉంటుంది. వారికి నెలకు రూ.20వేల నుంచి 25 వేలకు వేతనం అందిస్తారు. ఓవర్‌టైమ్ చేసి చాలామంది రూ.30వేల వరకు సంపాదిస్తుంటారు. ఈ ఉద్యోగానికి కనీస విద్యార్హతలు ఉంటే సరిపోతుంది కానీ, అభ్యర్థులు శారీరకంగా ధృఢంగా ఉండటం తప్పనిసరి. ఈ ఉద్యోగానికి దరఖాస్తు చేసుకునేందుకు కొందరు 400 కి.మీ. ప్రయాణించి రావడం గమనార్హం. వారిలో పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ పూర్తి చేసినవారు కూడా ఉన్నారు. ఉన్నత చదువులు చదివినా ఇప్పటివరకు ఉద్యోగం లభించనివారు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవడం కోసం వచ్చారు. మరికొందరు రాజస్థాన్ నుంచి వచ్చినవారు ఉన్నారు.

మోడీ.. ఇప్పటికైనా అసత్యాలు ఆపండి : ప్రియాంక గాంధీ

నిరుద్యోగ సమస్యపై ప్రధానమంత్రి మోడీ ఇప్పటికే అసత్యాలు ఆపాలని కాంగ్రెస్ నాయకులు ప్రియాంక గాంధీ వాద్రా తెలిపారు. కోట్ల ఉద్యోగ అవకాశాలు కల్పించామని ప్రధాని మోడీ అసత్య ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఇదంతా ప్రజల దృష్టిని మళ్లించేందుకు చేస్తున్న ప్రయత్నమన్నారు. ముంబయి ఎయిర్‌పోర్టులో నిరుద్యోగుల వెల్లువ ఘటనను ప్రస్తావిస్తూ.. 'ఎక్స్' వేదికగా మోడీ సర్కార్‌పై ప్రియాంక విమర్శలు గుప్పించారు.

"ఇప్పటివరకు ఎన్‌డిఎ ప్రభుత్వం దేశవ్యాప్తంగా 8 కోట్ల ఉద్యోగాలు కల్పించి రికార్డు సృష్టించిందని ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో మోడీ చెప్పారు. అవన్నీ అసత్య ప్రచారాలే. తాజాగా ముంబయి ఎయిర్‌పోర్టులో ఉపాధి కోసం నిరుద్యోగులు భారీగా తరలివెళ్లారు. ఈ పరిస్థితి దేశంలో నెలకొన్న నిరుద్యోగ సమస్య తీవ్రతకు అర్థం పడుతోంది." అని విమర్శించారు. "బూటకపు వాగ్దానాల ద్వారా ప్రజల దృష్టిని మళ్లించకండి. దయచేసి యువతకు కొత్త అవకాశాలు కల్పించండి" అని కేంద్రాన్ని ఆమె కోరారు.

త్రిపురలో బిజెపి హింసాత్మక దాడులను ఖండించిన పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : త్రిపురలో పంచాయితీ ఎన్నికలకు ముందు అధికార బిజెపి చేస్తున్న హింసాత్మక దాడులను సిపిఎం పొలిట్ బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల తేదీ ప్రకటించినప్పటి నుంచి సిపిఎం, ప్రతిపక్షాల అభ్యర్థులు, వారి మద్దతుదారులపై బిజెపి గూండాలు ఎడతెగని దాడులు చేస్తున్నారని విమర్శించింది.

సిపిఎం అభ్యర్థులపైనా, వారి మద్దతుదారులపైనా క్రూరమైన దాడులకు పాల్పడుతూ నామినేషన్లను దాఖలు చేయకుండా బలవంతంగా అడ్డుకుంటున్నారని తెలిపింది. ఈ నెల 13న బిజెపి గూండాలు చేతిలో దక్షిణ త్రిపుర జిల్లా పరిషత్‌కు సిపిఎం అభ్యర్థి బాదల్ షిల్‌ను దారుణ హత్యకు గురయ్యారని తెలిపింది.

బిజెపి గూండాల క్రూరమైన దాడుల కారణంగా సిపిఎంకు చెందిన అనేకమంది నాయకులు, కార్యకర్తలు గాయపడి ఆసుపత్రి పాలయ్యారని తెలిపింది. వివిధ ప్రాంతాల్లో ఎన్నికల అధికారులు నిర్వహించిన అఖిలపక్ష సమావేశాల్లోనూ పాల్గొనకుండా ప్రతిపక్ష నాయకులను బలవంతంగా అడ్డుకున్నారు, నామినేషన్ సమర్పించడానికి ప్రయత్నిస్తున్న ప్రతిపక్ష అభ్యర్థిని చంపేస్తానని బిజెపి నాయకులు బెదిరించారు, పోలీసు సిబ్బంది సమక్షంలోనే ప్రతిపక్ష నేతల వాహనాలపై దాడి చేశారని పొలిట్ బ్యూరో తెలిపింది. సిపిఎంకు ప్రముఖ నేతలపై పలు చోట్ల దాడులు జరిగాయని, పార్టీ ఊరేగింపులపై రాళ్లు రువ్వడం, పార్టీ నేతల నివాసాలపై బాంబులు విసిరిన ఘటనలు అనేకం రాష్ట్రంలో జరిగాయని తెలిపింది. రాష్ట్రంలో బిజెపి గెలిచినప్పటి నుంచి రాష్ట్రంలోని ప్రతిపక్షాలను నిర్మూలించాలనే తన ఎజెండాను ఏకపక్షంగా పార్టీ కొనసాగిస్తోందని విమర్శించింది. 2018 నుంచి ప్రారంభమైన ఈ దాడుల్లో పార్టీకి చెందిన 30 మంది సభ్యులు, కార్యకర్తలు మరణించినట్లు తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా భయానక వాతావరణాన్ని బిజెపి సృష్టించిందని తెలిపింది. ఆగస్టు 8న జరిగే ఎన్నికలకు అభ్యర్థులందరూ నామినేషన్లు దాఖలు చేసేలా తగిన చర్యలు తీసుకోవాలని, ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని పొలిట్ బ్యూరో డిమాండ్ చేస్తోంది.

ఆదాయపు పన్ను రేట్లను తగ్గించాలి

- 56 శాతం మంది డిమాండ్
- బడ్జెట్‌లో ఉపశమనం కల్పించాలి
- నిరుద్యోగాన్ని పరిష్కరించాలి
- ఇటి సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్ను రేటును తగ్గించాలని మెజారిటీ పన్ను చెల్లింపుదారులు డిమాండ్ చేస్తున్నారు. మోడీ సర్కార్ పన్ను భారాలు తగ్గించడం ద్వారా ప్రజల చేతుల్లో నగదు ఉంటుందని.. దీంతో వినిమయానికి డిమాండ్ పెరుగుతుందని సూచిస్తున్నారు. జులై 23న ఆర్థిక శాఖ మంత్రి మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సందర్భంగా ఎకనామిక్స్ టైమ్స్ ఆన్‌లైన్ సర్వేలో 9500 మంది అభిప్రాయాలను సేకరించింది.

వచ్చే బడ్జెట్‌లో తమకు పన్ను భారాల నుంచి ఉపశమనం కల్పించేలా పన్ను రేట్ల తగ్గింపునకు ప్రాధాన్యతను ఇవ్వాలని 56 శాతం మంది అభిప్రాయపడ్డారు. దేశంలో పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభాన్ని కట్టడి చేయాలని 37 శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు నగదు బదిలీ పెంచాలని కేవలం 4 శాతం మంది మాత్రమే పేర్కొనడం గమనార్హం. రైల్వేలకు నిధుల కేటాయింపు పెంచాలని 2 శాతం మంది కోరారు.

పన్ను రేట్ల శ్లాబులను హేతుబద్ధీకరించాలని.. రూ.15 లక్షల లోపు ఆదాయం కలిగిన వారికి ఆదాయపు పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని 53 శాతం మంది అభిప్రాయపడ్డారు. 80సి పన్ను మినహాయింపుల పరిధిని పెంచాలని 20 శాతం మంది కోరారు. అధిక శ్లాబులో ఉన్న వారిపై పన్ను రేట్లను పెంచాలని, తక్కువ శ్లాబులో ఉన్న వారిపై పన్ను రేట్లకు కోత పెట్టాలని 11 శాతం మంది డిమాండ్ చేశారు.

2024-25లో ఇప్పటివరకు ప్రత్యక్ష పన్నుల వసూళు రూ.5.74 లక్షల కోట్లకు పెరిగాయి. గడిచిన ఆర్థిక సంవత్సరం ఇదే సమయంతో పోల్చితే 20 శాతం అదనం. ఇందులో రూ.3.61 లక్షల కోట్లు వ్యక్తిగత పన్ను ఆదాయానికి సంబంధించినవే. ఫిబ్రవరి 1న ప్రకటించిన మధ్యంతర బడ్జెట్‌లో 2024-25లో ఆదాయపు పన్ను వసూళ్లు రూ.11,56,000 కోట్లకు పెరుగుతాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. ఇది 2023-24తో పోల్చితే 13 శాతం ఎక్కువ. ఆదాయపు పన్ను రేట్లను తగ్గించడం ద్వారా ఇప్పటికే వెనుకబడిన వినియోగ స్థాయిలను పెంచవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. తద్వారా ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సహం లభించనుందని అభిప్రాయపడుతున్నారు.

సిబిఐ కేసులో కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ పై తీర్పు రిజర్వ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో సిబిఐ తనను అరెస్టు చేయడం, రిమాండ్‌కు పంపడాన్ని సవాలు చేస్తూ ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ దాఖలు పిటిషన్‌పై తీర్పును ఢిల్లీ హైకోర్టు బుధవారం రిజర్వ్ చేసింది. తాత్కాలిక బెయిల్ కోరుతూ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై కూడా తీర్పును కోర్టు రిజర్వ్ చేసింది. సిబిఐ తరపున కోర్టుకు హాజరైన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ డిపి సింగ్ తన వాదన వినిపిస్తూ చిన్నపాటి అనుమానం వచ్చినా వ్యక్తులను అరెస్టు చేసే స్వేచ్ఛ సిబిఐకి ఉందని, ముఖ్యమంత్రిని అరెస్టు చేసిన సమయంలో కూడా సిబిఐ తగిన ఆధారాలున్నందునే అరెస్టు చేసిందని వాదించారు. విచారణ కోసం అరెస్టు చేయడాన్ని సిఆర్‌పిసి అనుమతిస్తుందని, కేజ్రీవాల్ కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమైనందునే కేజ్రీవాల్‌ను దర్యాప్తు సంస్థ అరెస్టు చేసిందని అన్నారు. విచారణను ప్రభావితం చేసి, పక్కదారి పట్టించే సామర్థ్యం కేజ్రీవాల్‌కు ఉందని నిరూపించేందుకు తగిన మెటీరియల్ సిబిఐ వద్ద ఉందని డిపి సింగ్ వాదించారు. సిబిఐ దర్యాప్తు తుది దశలో ఉందని, సిఎంను విడుదల చేస్తే సాక్ష్యులను ప్రభావితం చేసే అవకాశాలున్నాయనే సహేతుకమైన భయాలు తమకు ఉన్నాయని చెప్పారు.

మందుల పరిశ్రమలో పేలిన రియాక్టర్

(మొదటి పేజీ తరువాయి)

విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పరిశ్రమల్లో భద్రత ప్రమాణాలు పాటించకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు.

యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలి : సిపిఎం

వసంత్ కెమికల్స్ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని, కార్మికుని కుటుంబానికి రూ.కోటి పరిహారం ఇవ్వాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. ఫార్మా సిటీలో కార్మికులకు పని ప్రదేశాల్లో భద్రత లేకుండా పోతుందని, ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రమే కమిటీల పేరుతో హడావుడి చేస్తున్నారని తెలిపారు. ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

మృతుని కుటుంబానికి న్యాయం చేస్తాం : ఎమ్మెల్యే సుందరపు

ప్రమాద స్థలిని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిశ్రమలో సేఫ్టీ ప్రమాణాలు మెరుగు పర్చేలా చర్యలు తీసుకుంటామని, మృతుని కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తానని అన్నారు.

సేఫ్టీ ఆడిట్ థర్డ్ పార్టీకి ఇవ్వడమే కారణం : పరిశ్రమల ప్రమాదాలపై కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి

సేఫ్టీ ఆడిట్‌ను గత వైసిపి ప్రభుత్వం థర్డ్ పార్టీ ఏజెన్సీలకు అప్పగించడమే పరిశ్రమల్లో వరుస ప్రమాదాలు జరగడానికి కారణమని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అనుభవం లేని అధికారులను నియమించి థర్డ్ పార్టీ చేతిలో పెట్టి లంచాలు కొల్లగొట్టారని విమర్శించారు. విచ్చలవిడిగా లైసెన్సులు జారీ చేయడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. థర్డ్ పార్టీ ఏజెన్సీ, అధికారులు కుమ్మక్కై ఫ్యాక్టరీలలో భద్రతా చర్యలను నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. సేఫ్టీ ఆడిట్‌పై సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో సమీక్ష చేస్తామన్నారు. అన్ని ఫ్యాక్టరీలు, బాయిలర్స్ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించామని తెలిపారు. రూ.3 వేల కోట్ల భవన నిర్మాణ కార్మికులకు చెందిన నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించిందని విమర్శించారు.

ఇళ్లు ఇవ్వకుండానే ఎన్‌పిఎలుగా లబ్ధిదారులు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి 2024 ఆర్థిక సంవత్సరం మొదలయ్యే నాటికి వేర్వేరు బ్యాంకుల్లో 67,330 ఎకౌంట్లకుగాను రూ.2176.82 కోట్ల లోన్లు విడుదల చేశారు. అయితే టిడ్కో, గృహాల కేటాయింపునకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించిన మెప్మా నిర్లక్ష్యం వల్ల కొత్త సమస్యలు పుట్టుకువచ్చాయి. వాస్తవంగా 67 వేల ఎకౌంట్లు ఉన్నప్పటికీ వాటిల్లో 13,836 మందికి ఇళ్లను కేటాయించలేదు. కానీ వారి పేరుతో రూ.437.68 కోట్ల రుణాలు బ్యాంకర్లు ఇచ్చేశారు. ఇక్కడే బ్యాంకర్లు, మెప్మాకు మధ్య సమస్య మొదలైంది. తమ బ్యాంకుల్లో మెప్మా అధికారులు లబ్ధిదారుల పేరుతో ఎకౌంట్లు తెరిచారని, కానీ ఇళ్ల వద్దకు వెళితే కేటాయింపుల్లేవని, అసలు ఖాతాదారులను ఏమి అడగాలో తెలియడం లేదని బ్యాంకర్లు అంటున్నారు. దీంతో 13,836 ఎకౌంట్లను ఎన్‌పిఎలుగా మార్చేశారు. తక్షణం రూ.59.74 కోట్లు చెల్లిస్తే వాటిని రెగ్యులర్ ఎకౌం ట్లుగా మారుస్తామని మెప్మాకు సమాచారం ఇచ్చారు.

ఒకవైపు రుణ భారం

మరోవైపు టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులపై రుణభారం పెరుగుతోంది. టిడ్కో ఇళ్లు పొందిన వారిలో ఎక్కువ మంది నిరుపేదలు ఉన్నారు. ఇప్పుడు వారందరూ నెలకు కనీసం రూ.3800కు తక్కువ గాకుండా టంచనుగా బ్యాంకుల్లో లోను కట్టాలి. ఒకరోజు లేటయినా బ్యాంకర్లు నోటీసులు పంపిస్తున్నారు. అప్పోసాప్పో చేసి కట్టేదామనుకున్నా పనులు లేక ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించి రుణమాఫీకి చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కోరుతున్నారు


సంప్రదింపుల తర్వాతే 'స్థానిక కోటా' బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల్లో సి, డి గ్రేడ్ పోస్టులకు సంబంధించి 100 శాతం కన్నడిగుల నియమకాన్ని తప్పనిసరి చేసే బిల్లు కోసం మంత్రివర్గం ఆమోదం తెలిపినట్లు వార్తలొచ్చాయి. దీంతో ఈ బిల్లుపై పారిశ్రామికవేత్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రైవేటు సంస్థల్లో నాన్ మేనేజ్‌మెంట్ రోల్స్‌లో 70 శాతం, మేనేజ్‌మెంట్ రోల్స్‌లో 50 శాతం పోస్టులను మాత్రమే కన్నడిగులకు కేటాయించాలని తాము చెప్పినట్లు కర్ణాటక కార్మిక శాఖ వివరణ ఇచ్చింది. మళ్లీ బుధవారం రాత్రి బిల్లు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ప్రకటించింది.

కార్పొరేట్లపై పన్ను మరింత తగ్గింపు

- వలసదారులపై వేటు
- అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి ట్రంప్
- ముగిసిన జాతీయ సదస్సు



మిల్వాకీ : .కార్పొరేట్లపై పన్ను మరింత తగ్గిస్తామని, విదేశాల నుండి వచ్చే దిగుమతులపై అధిక సుంకాలు విధిస్తామని, చమురు, సహజవాయువు, బొగ్గు మైనింగ్ రంగాల్లో పెట్టుబడులు పెంచుతామని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపు అభ్యర్థిగా ఎంపికైన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్పారు. అమెరికన్ చరిత్రలోనే అతి పెద్ద వలసవాదుల బహిష్కరణ కార్యక్రమం అమలు చేస్తామని కూడా ఆయన ప్రకటించారు.విస్కాన్సిన్ రాష్ట్రంలోని మిల్వాకీలో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థిగా తన అభ్యర్థిత్వాన్ని అధికారికంగా ప్రకటించిన అనంతరం ఆయన ఈ మాటలన్నారు. మూడు రోజుల పాటు జరిగిన రిపబ్లికన్ పార్టీ జాతీయ సమ్మేళన్ మంగళవారంతో ముగిసింది. ఈ సదస్సులో ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ శారీరక, మానసిక బలహీనతలపై సెటైర్లు వేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేరును పుతిన్ అని పేర్కొనడాన్ని ప్రస్తావించారు. ట్రంప్ కోడలు, రిపబ్లికన్ నేషనల్ కమిటీ కో చైర్ అయిన లారా ట్రంప్ గత ఎన్నికల ఫలితాలను మోసపూరితమైనవంటూ కొట్టిపారేశారు. 2021 జనవరి6న ట్రంప్ తన అనుయాయులచేత కేపిటల్ హిల్స్‌లోని పార్లమెంటు భవనంపై తిరుగుబాటుకు ఎగదోయడాన్ని రిపబ్లికన్లు సమర్థించుకునే యత్నం చేశారు.

1.3 మిలియన్ల మందికి ప్రాతినిధ్యం వహిస్తున్న టీమ్‌స్టర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీన్ ఓ బ్రియన్ ఈ సదస్సునుద్దేశించి మాట్లాడుతూ, తాను ఎవరికీ లేదా ఏ పార్టీకి అనుబంధం ఉన్న వ్యక్తిని కాదని, అయితే అమెరికాలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా బ్యాంకులు, బడా కార్పొరేట్లకు అమ్ముడుపోతున్నాయని విమర్శించారు.

ఎస్‌సిల జాబితాతో రాష్ట్రాలు విభేదించకూడదు : సుప్రీం

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 కింద నోటిఫై చేయబడిన షెడ్యూల్డ్ కులాల జాబితాతో రాష్ట్రాలు విభేదించరాదని సుప్రీంకోర్టు పేర్కొంది . ' ఏదైనా కులం, జాతి లేదా తెగ లేదా కులాల్లోకి వేరే భాగాలను చేర్చడం లేదా మినహాయించడం అనేది పార్లమెంటు చేసిన చట్టం ప్రకారమే జరగాలని తెలిపింది.

ఇజ్రాయిల్ దాష్టీకానికి మరో 20 మంది బలి

- ఐరాస భవనంపైనా బాంబులు

గాజా సిటీ: అమెరికా అండ చూసుకుని ఇష్టానుసారంగా చెలరేగిపోతున్న నెతన్యాహు ప్రభుత్వం తాజాగా జరిపిన వైమానిక దాడుల్లో 20 మంది ప్రాణాలు తీసింది. ఐరాస భవనంపైనా బాంబులు కురిపించింది.సెంట్రల్ గాజాలోని సుసీరత్‌లో ఓ పాఠశాల భవనంలో నడుపుతున్న ఐరాస సహాయక శిబిరంపైన, దక్షిణాన ఉన్న ఖాన్ యూనిస్‌లోని మవాసి ప్రాంతంపైన ఇజ్రాయిల్ సైన్యం జరిపిన ఫాసిస్టు దాడుల్లో ప్రాణ నష్టంతో బాటు ఆస్తి నష్టం కూడా చోటు చేసుకుందని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది. ఇజ్రాయిల్ తన చర్యను సమర్థించుకోవడానికి అక్కడ హమాస్ ఉగ్రవాదులు ఉన్నారని ఎప్పటిలాగే చెప్పింది.ఐరాస సహాయక శిబిరంపై దాడిలో చనిపోయినవారిలో అయిదుగురు పారామెడికల్ సిబ్బంది ఉన్నారు. మరో డజను మంది దాకా పాలస్తీనా పౌరులు గాయపడ్డారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డ నిర్వాసితుల కోసం సుసిరత్‌లో ఐక్యరాజ్యసమితి ఈ సహాయక శిబిరం నడుపుతోంది. ఇజ్రాయిల్ దాడి పదవ నెలలోకి ప్రవేశించింది. ఇంతవరకు 38 వేల మందికిపైగా పాలస్తీనీయుల ప్రాణాలను ఇజ్రాయిల్ హరించిందని గాజా ఆరోగ్య మంత్రిత్వశాఖ తెలిపింది.

'మహా స్టీల్' ఏర్పాటు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

స్టీల్‌ను వ్యూహాత్మక అమ్మకానికి పెట్టిన నుంచీ ఐక్యంగా పోరాడుతూ కార్మికులు ప్రయివేటీకరణను తిప్పికొట్టడం హర్షణీయమన్నారు. రాత్రికి రాత్రే స్టీల్ ప్లాంటు సంక్షోభంలోకి వెళ్లలేదని, మూడు మిలియన్ టన్నుల నుంచి 6.5 మిలియన్ టన్నుల విస్తరణలో భాగంగా 36 నెలల్లో జరగాల్సిందని, వంద నెలలు పట్టిందని వివరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ 30 ఏళ్లుగా సొంత గనుల్లేకుండా స్టీల్‌ప్లాంట్ నడుస్తుందంటే కార్మికుల గొప్పతనమని, ఈ ప్లాంట్‌కు కార్మికుల ఐక్యతే బలమని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడం అసాధ్యమైన పని అన్నారు. కాంట్రాక్టు వర్కర్లకు మూడు నెలలుగా కాంట్రాక్టర్లు జీతాలివ్వడం లేదని, ఉద్యోగులు, కార్మికులకు యాజమాన్యం సక్రమంగా జీతాలివ్వడం లేదని తెలిపారు. స్టీల్ ప్లాంట్ మనుగడకు స్థలాలను అమ్మేయాలని యాజమాన్యం, కేంద్రం చూస్తోందని, ఇది ఎంతమాత్రమూ పరిష్కారం కాదని అన్నారు. దేశంలో ఐడిపిఎల్, ఎయిర్ ఇండియా ఆస్తులను ఇలాగే అమ్మేశారని గుర్తు చేశారు. కేంద్రం రాజకీయంగా బలహీనంగా ఉందని, రాష్ట్రంలోని టిడిపి, జనసేన కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్టీల్ ప్రయివేటీకరణను నిలుపుదల చేయించాలని కోరారు. కేంద్ర మంత్రి కుమారస్వామి ప్రయివేటీకరణ సమస్యే లేదని ప్రకటించడం మంచి విషయమేనని, అయితే, రెండు నెలలు వ్యవధి అడిగారని గుర్తు చేశారు. ఈలోగా ఉత్పత్తిని యాజమాన్యం కుంటుపరుస్తోందని, కార్మికులకు సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని అన్నారు. దీనికి వ్యతిరేకంగా సిఐటియు, కార్మికులు పోరాడుతారని హెచ్చరించారు. ఈ సెమినార్‌లో మాజీ డైరెక్టర్ కెకెరావు, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, మాజీ ఇడి ఫైనాన్స్ జిఎస్ఎన్ మూర్తి ప్రసంగించారు. సభా వేదికపై స్టీల్ నాయకులు అయోధ్యరామ్, యు.రామస్వామి, జిఎస్.రాజు, సురేష్‌బాబు, శ్రీనివాస్‌నాయుడు, పరంధామయ్య, డివిఆర్ రమణారెడ్డి తదితరులు ఆశీనులయ్యారు.



మీకోసం

పప్పు త్వరగా ఉడకాలంటే బియ్యం నానబెట్టిన నీళ్లను పోసి ఉడికించుకోవాలి.

జీవన సౌరభం

గెలుపు గురించి అతిగా ఆలోచించొద్దు.. వచ్చిన అవకాశాన్ని సక్రమంగా ఉపయోగించుకో..

JEEVANA జీవన the family

నిండు కుండ




భీమాళి ఊరి చివర పెద్ద మంచినీళ్ల బావి ఉండేది. గ్రామస్తులంతా ఆ బావి దగ్గరికి వెళ్లి నీళ్ళను చేదుకుని కుండలతో తెచ్చుకునేవారు. అలా ఓసారి అమ్మలక్కలంతా నీటి కుండలు నెత్తిన పెట్టుకుని ఊసులాడుకుంటూ వస్తున్నారు. వారిలో ఒక అమ్మాయి కుండ వెలితిగా ఉంది. నడుస్తూ ఉంటే ఆ కుండలో నీళ్ళు గలగల శబ్దం చేస్తూ కిందకి మీదకి ఎగురుతున్నాయి. ముందు నడిచే వాళ్ళ మీదకు, వెనుక వచ్చే వాళ్ల మీదకు ఆ నీటి తుంపరలు పడుతున్నాయి దాంతో వారికి కోపం వచ్చింది.

'నువ్వు మాతో రాకు, నీ కుండలో నీళ్ళు మా మీదకు తుళ్లుతున్నాయి' అని విసుక్కున్నారు. చేసేదేమీ లేక వారికి దూరంగా నడవసాగింది. మర్నాడు ఆ గ్రామంలో గ్రామ దేవత పండగ జరిగింది. ఆ సందర్భంగా అన్న సంతర్పణ ఏర్పాటు చేసారు. ఈలోగా సన్నని గాలి వీచింది. పప్పు అన్నం, కూరలు, పరమాన్నం వడ్డించిన ఆకు ఎగరకుండా ఉంది. ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడింది.

నిండుకుండ తొణకలేదు. అన్నీ ఉన్న ఆకు ఎగరలేదు. మన సమాజంలో కూడా నిండు కుండ లాంటి వ్యక్తులు ఉన్నారు. వారు ప్రతిభావంతులు, సంస్కార వంతులు వినమ్రంగా ఉంటారు. తమని గుర్తించాలని కోరుకోరు. అన్నీ ఉన్న ఆకు వలె అణిగి మణిగి ఉంటారు. ఇక రెండో రకం వెలితి కుండ లాంటివారు. వీరు మిడిమిడి జ్ఞానం కలవారు అన్నీ తమకే తెలుసన్న గర్వంతో ఏమీ లేని ఆకులా ఎగిరెగిరి పడతారు. చేసింది తక్కువ చెప్పుకునేది ఎక్కువ. గుర్తింపుకోసం తాపత్రయ పడతారు. వీరు వెలితి కుండ లాంటివారు. నిండు కుండ తొణకదు అన్నా, అన్నీ ఉన్న ఆకు అణిగి మణిగి ఉంటుందన్నా ఒకటే వెలితి కుండ తొణుకుతుందన్నా, ఏమీ లేని ఆకు ఎగిరెగిరి పడుతుందన్నా అర్థం ఒకటే.

– కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.



బొమ్మను గీయండి!

పిల్లలూ, కింద ఇచ్చిన అంకెల ఆధారంగా పిల్లి బొమ్మ గీయడం నేర్చుకుందామా!

నేను గీసిన బొమ్మ





బి.రమ్య,
తొమ్మిదవ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
హవేలీ ఘనపూర్,
మెదక్ జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

తీర్పులిచ్చే హక్కు ఎవరిచ్చారు?

సందర్భం 1 : ఆమెకి పెళ్లయ్యింది. పిల్లలున్నారు. అన్యోన్యంగా జీవిస్తున్న దంపతుల మధ్య ఓ చిన్న అగాథం. అది చిలికి చిలికి గాలివానలా మారింది. ఇద్దరూ విడిపోయే పరిస్థితి వచ్చింది.

సందర్భం 2 : ఆ అమ్మాయి, అబ్బాయి ఒకరికొకరు ఇష్టపడ్డారు. పెద్దలను ఎదిరించి పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికి మనస్పర్థలు వచ్చి ఇద్దరూ వాళ్ల పుట్టిళ్లకి వెళ్లిపోయారు. నచ్చిన వాళ్లతో కలిసి జీవిస్తున్నారు.

సందర్భం 3 : భర్త వేధింపులు తాళలేక ఓ భార్య విడాకులు కోరింది. పిల్లల బాధ్యత తనకే కావాలంది.

సందర్భం 4 : భర్తతో కలిసి ఉండడం ఇష్టం లేని ఓ మహిళ తనకిష్టమైన వ్యక్తితో సహజీవనం చేస్తోంది. గర్భం దాల్చింది. అబార్షన్ చేయించుకుంది.



ఈ సందర్భాలన్నీ ఆమె వ్యక్తిగతం. అందులోకి తొంగి చూడాల్సిన అవసరం, హక్కూ ఎవరికీ లేదు. కానీ అదే పనిగా వేలు పెట్టడం చాలామందికి అలవాటు. గుచ్చిగుచ్చి వేధించడం, వెంట పడి గేలి చేయడం కొంతమంది ఆనవాయితీగా పెట్టుకుంటారు.

సమాజంలో మహిళల పరిస్థితి రానురాను తీసికట్టుగా తయారవుతోంది. ఒకపక్క అత్యాచారాలు, హత్యలతో కాలరాస్తుంటే, మరోపక్క తన వ్యక్తిగత గోప్యతకి భంగం కలిగిస్తూ బతికున్న శవంలా మార్చేస్తున్నారు. ఆమె అంటే చిన్న చూపు. ఏమన్నా పడుతుంది.. ఏమన్నా సహిస్తుంది అన్న ధోరణి నరనరాన జీర్ణించుకుపోయిన సమాజం మనది.

జీవించడం అంటే ప్రాణం ఉండడమే కాదు.. పరువుగా, గౌరవంగా బతకడం అని కూడా! కానీ ఆ స్పృహ లేకుండా ప్రవర్తించడం ప్రస్తుత కాలంలో ఎక్కువైంది. వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగేలా ప్రవర్తించడం జీవించే హక్కును ఉల్లంఘించడం కింద వస్తుందని ఇక నుండి వ్యక్తిగత గోప్యతను ప్రాథమిక హక్కుగా భావించాలని 2017 ఆగస్టులో దేశ అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది.

రెండు రోజుల క్రితం నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలో ఓ యువజంట రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకుంది. ఆ ఘటనకు ముందు వాళ్లు సోషల్ మీడియాలో ఓ వీడియో విడుదల చేశారు. 'తాను ఓ తప్పు చేశానని, దాన్ని భర్త క్షమించినా బంధువులు తమపై దుష్ప్రచారం చేస్తున్నారని, అది తట్టుకోలేక ఇద్దరం గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడుతున్న'ట్లు అందులో వివరించారు.

ఎంత దారుణం? ఉజ్వల భవిష్యత్తు ఉన్నవాళ్లు అర్థంతరంగా జీవితాలను నాశనం చేసుకున్నారు. ఆ దంపతుల జీవితాల్లో వచ్చిన ఏదేని సంఘటన వారి వ్యక్తిగతం. అర్థం చేసుకోవడం, అపార్థాలకు పోవడం కూడా వారి వ్యక్తిగతమే. రాజీ పడడం, విడిపోవడం పూర్తిగా వారికి మాత్రమే సొంతమైన అంశం. కానీ ఇక్కడ అటువంటిదేమీ జరగలేదు. వారికి లేని బాధ బంధువులకు వచ్చింది. సూటిపోటు మాటలతో అవమానించారు. అవహేళన చేశారు. ప్రాణాలు తీసుకునేంతవరకు వారి జోక్యం వెళ్లిందంటే పరిస్థితులు ఎంత దిగజారుతున్నాయో అర్థం చేసుకోవచ్చు.

సాధారణ మహిళలకే ఈ తలవొంపులా అంటే అదీ లేదు. ఇటీవల ఓ ఉన్నతాధికారిణిపై మూకుమ్మడి దాడి చేస్తున్నారు. తన వ్యక్తిత్వాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారు. ఎప్పుడో విడాకులు తీసుకున్న భర్త ఇప్పుడు పెట్టిన కేసుని ఆసరా చేసుకుని ఆమె చుట్టూ అవమానాల కోట కడుతున్నారు. బిడ్డ పుట్టుకపై నిందలు మోపుతున్నారు. సోషల్ మీడియా వేదికగా ఇష్టారాజ్యంగా వ్యాఖ్యలు చేస్తున్నారు. అసలు ఈ స్వేచ్ఛ ఎవరిచ్చారు? మాట్లాడే స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంటుంది. కానీ ఇతరుల వ్యక్తిగత విషయాల జోలికి వెళ్లనంత వరకే దాని పరిధి ఉంటుంది. అది మీరి, ఆమె మాజీ భర్త, ప్రస్తుత భర్త, బిడ్డ పుట్టుకకి కారణమైన వ్యక్తి అంటూ తన క్యారెక్టర్‌ని తప్పుగా చిత్రీకరిస్తున్నారు.

ఆ ఉన్నతాధికారి పేరు, ఆమె ఫొటోతో సహ బహిరంగంగా ప్రచారం చేశారు. ఇది చట్టానికి పూర్తి విరుద్ధం. వ్యక్తిగత గోప్యతను సంరక్షించే బాధ్యతగా సదరు వ్యక్తుల వివరాలు ఎక్కడా ప్రస్తావించకూడదు. ప్రచురించకూడదు. బాధ్యతగా వ్యవహరించాల్సిన మీడియా పదే పదే ఆమె పేరును, ఫొటోని ప్రసారం చేసింది. ఫలితంగా బాధితురాలు తన వ్యక్తిత్వం గురించి, తను పడుతున్న మానసిక వేదన గురించి మీడియా సాక్షిగా వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.


ఇంతలా ఎందుకు అవమానిస్తున్నారు? ఆమె జీవితం, ఆమె ఇష్టం. ఇతరుల జోక్యం ఎందుకు? విడాకులు తీసుకున్న వ్యక్తి మళ్లీ ఆమె వ్యక్తిగత విషయాల్లో తలదూర్చకూడదు. కానీ, అతడి ద్వారా ఆమెపై దుష్ప్రచారం జరుగుతోంది. మీడియా, సోషల్ మీడియా ఇష్టానుసారం ఆమె వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నాయి.

మొన్నటికి మొన్న చట్టసభ సాక్షిగా ఓ రాజకీయ నాయకుడి భార్యపై కొందరు కువ్యాఖ్యలు చేశారు. ఆమెకొడుకుకు తండ్రి ఎవరన్నంత వరకు దిగజారి వ్యాఖ్యలు చేశారు. ఇది ఎంత సిగ్గుమాలిన చర్య.

మహిళలను ఎంత చవకబారు మాటలైనా అనొచ్చు. తన గౌరవాన్ని ఎంతటికైనా తగ్గించొచ్చు అన్న ధోరణే ఇక్కడ కనిపిస్తోంది. ఈ సందర్భాలన్నింటిలో సాధారణ మహిళ దగ్గర నుండి ఉన్నతాధికారి, రాజకీయ నాయకురాలు.. ఎవరైనా సరే.. హోదా ఎంత పెద్దదైనా, ఎన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించినా ఆమె అంటే అదే చులకన, అదే చిన్నచూపు. ఈ పరిస్థితి మారాలి. వ్యక్తులు పరిణతితో, విచక్షణతో ప్రవర్తించాలి.

– జ్యోతిర్మయి

చట్టపరంగా చర్యలు తీసుకోవాలి



మహిళల విషయంలో విపరీత వ్యాఖ్యలు చేసిన వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చు. వేధింపులు, దాడులు లాంటి సంఘటనలే కాదు, తన వ్యక్తిత్వాన్ని కించపరిచే వ్యాఖ్యలు ఎవరు చేసినా సుమోటాగా కేసు పెట్టొచ్చు. బిడ్డలను కనే హక్కు స్త్రీలకి ప్రకృతి ప్రసాదించింది. ఆ హక్కుని కాదనడం లేక ఆ బిడ్డ ఎవరికి పుట్టారు? అని ప్రశ్నించడం నేరం. ఉన్నతాధికారి అంశంలో తనని తక్కువ చేసి మాటలన్న భర్త, తప్పుడు వార్తకథనాలు ఇచ్చిన మీడియాపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయనవసరం లేదు. మహిళల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉంది. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా స్త్రీల గౌరవానికి భంగం కలిగించకూడదు. ఒకవేళ అలా చేస్తే శిక్షార్హులు. ఇది చట్టంలో ఉంది.

– డి.రమాదేవి,
ఐద్వా రాష్ట్ర నాయకురాలు.

2017 ఆగస్టు 24న వ్యక్తిగత గోప్యతా హక్కు (రైట్ టు ప్రైవసీ)ని ప్రాథమిక హక్కుగా గుర్తిస్తూ సుప్రీం కోర్టులోని రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పునిచ్చింది. రాజ్యాంగ ధర్మాసనంలో అప్పటి సీజేఐ జేఎస్ ఖేహర్‌తోపాటు న్యాయమూర్తులు జస్టిస్ జే చలమేశ్వర్, జస్టిస్ ఎస్ఏ బాబ్డే, జస్టిస్ ఆర్‌కే అగర్వాల్, జస్టిస్ ఆర్ఎఫ్ నారీమన్, జస్టిస్ ఏఎం సప్రే, జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్ సభ్యులుగా కొనసాగారు. వ్యక్తిగత గోప్యతా హక్కు అనేది.. ఆర్టికల్ 21లోని గౌరవంగా జీవించే హక్కులో భాగమని ధర్మాసనం పునరుద్ఘాటించింది. ఈ తీర్పుతో 1954లో ఎంపీ శర్మ కేసులో, 1962లో ఖరాగ్ సింగ్ కేసులో సుప్రీం ఇచ్చిన రెండు తీర్పులను 2017లో సుప్రీం కోర్టు తిరగరాసింది.

కొన్ని పథకాలకు ఆధార్ తప్పనిసరి చేస్తూ అప్పట్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో వ్యక్తిగత గోప్యతా హక్కుపై అప్పట్లో పెద్దయెత్తున చర్చ మొదలైంది. కోర్టులో కేంద్ర ప్రభుత్వం తరఫున న్యాయవాదులు వ్యక్తిగత గోప్యతా హక్కును గుర్తించేందుకు నిరాకరించారు. ఇదివరకటి సుప్రీం కోర్టు తీర్పులను వారు ప్రస్తావించారు. సుదీర్ఘ వాదోపవాదాల అనంతరం మొత్తంగా ఈ హక్కు ప్రాథమిక హక్కుల కిందకు వస్తుందని కోర్టు స్పష్టం చేసింది.

విద్యలో నాణ్యత దిగజారుతోంది

- ప్రాథమిక స్థాయి పూర్తయినా అక్షరాలు చదవలేకపోతున్నారు
- భారత్‌పై యునిసెఫ్ నివేదిక



న్యూఢిల్లీ : భారత్‌లో విద్యలో నాణ్యత దిగజారుతోందని యునిసెఫ్ తాజా నివేదిక ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాథమిక విద్యలో భారత్ గణనీయమైన పురోగతి సాధించినా.. అప్పర్ సెకండరీ స్థాయి విద్యను పూర్తి చేసే రేటు ఆందోళన కలిగిస్తోందని తెలిపింది. నివేదిక ప్రకారం మన దేశంలో అప్పర్ సెకండరీ స్థాయి విద్యను పూర్తి చేసిన రేటు కేవలం 51 శాతంగానే ఉండడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఈ విషయంలో బంగ్లాదేశ్, ఇండోనేషియా కంటే భారత్ వెనుకబడి ఉంది. సెకండరీ విద్యను పూర్తి చేసే వరకూ విద్యార్థులకు మద్దతు ఇవ్వాల్సిన అవసరాన్ని నివేదిక నొక్కి చెబుతోంది. విద్యా రంగంలో లింగ సమానత్వం మన దేశంలో ఒకేలా లేదు. ప్రాథమిక, లోయర్ సెకండరీ స్థాయిల్లో అసమానతలు తక్కువగా ఉండగా అప్పర్ సెకండరీ స్థాయిలో అధికంగా ఉన్నాయి. సెకండరీ విద్యను పూర్తి చేసుకుంటున్న యువతుల సంఖ్య పెరుగుతోంది. అలాగే, 2025 నాటికి సాధించాలనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి కావాల్సిన వేగం కన్పించడం లేదు. సెకండరీ స్థాయిలో లింగ అసమానతలను తగ్గించుకోవడంలో బంగ్లాదేశ్, భూటాన్ వంటి దేశాలు పురోగతి సాధించాయి. భారత్‌లో విద్యా నాణ్యత ఆశించిన స్థాయిలో లేదని, ఎక్కువ మంది విద్యార్థుల్లో నైపుణ్యం కన్పించడం లేదని నివేదిక తెలిపింది. ప్రాథమిక విద్యను పూర్తి చేసిన వారు సైతం అక్షరాలు సరిగా చదవలేకపోతున్నారని పేర్కొంది. విద్యలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకోవాల్సిన అవసరం కూడా ఉంది. ప్రాథమిక పాఠశాలలను కూడా ఇంటర్నెట్‌తో అనుసంధానించాలని యునిసెఫ్ నివేదిక సూచించింది. ఈ విషయంలో మన దేశం బాగా వెనుకబడి ఉంది. నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంటేనే నాణ్యమైన విద్యను అందించగలుగుతామని యునెస్కో ఇటీవల విడుదల చేసిన నివేదిక స్పష్టం చేసింది.

తెలంగాణలో నేడు రుణమాఫీ

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో రైతులు వ్యవసాయ అవసరాల నిమిత్తం బ్యాంకుల నుంచి తీసుకున్న లక్ష రూపాయల వరకు రుణాలు మాఫీ కానున్నాయి. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుమారు రూ.ఏడు వేల కోట్లను 11.5లక్షల మంది రైతుల ఖాతాల్లోకి నేరుగా జమ చేయనున్నారు. ఎన్నికల హామీ మేరకు రూ.రెండు లక్షల వరకు వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాల నేపథ్యంలో మూడు విడతలుగా వచ్చే నెల ఆగస్టు 15 నాటికి పూర్తి స్థాయిలో రైతు రుణాలను కాంగ్రెస్ ప్రభుత్వం మాఫీ చేయనుంది. లక్షన్నర వరకు ఉన్న రుణాలు జులై ఆఖరునాటికి మాఫీ కానున్నాయి. ఆపై రుణాలను ఆగస్టు 15లోగా మాఫీ చేసేందుకు ఆర్థిక శాఖ చర్యలు చేపట్టింది. ఇందుకు అవసరమైన రూ.31 వేల కోట్లను ఆర్థిక శాఖ సమీకరించింది. వ్యవసాయ రుణాలను ఇతర ఖాతాలకు బదిలీ చేయవద్దని బ్యాంకర్లకు రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ఢిల్లీ అధికారిక నివాసంలో చంద్రబాబు ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలోని రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక బంగ్లా (జన్‌పథ్–1)లో సిఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఢిల్లీ పర్యటనకు వచ్చిన ఆయన కేంద్ర హోంమంత్రిని కలిసి వివిధ అంశాలపై చర్చించారు. అలాగే బడ్జెట్ కేటాయింపులపైనా విజ్ఞప్తి చేశారు. అనంతరం బుధవారం ఉదయం తొలి ఏకాదశి సందర్భంగా సిఎం అధికారిక నివాసంలో పూజలు నిర్వహించారు. అనంతరం విజయవాడకు చంద్రబాబు తిరుగు ప్రయాణమయ్యారు. అంతకముందు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి అమిత్ షాకు చంద్రబాబు వివరించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఆర్థిక విధ్వంసానికి గురైందని వెల్లడించారు. అస్తవ్యస్త నిర్వహణ, అవినీతి కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ గాడి తప్పిందని అన్నారు. 2019–24 ఆర్థిక సంవత్సరాల మధ్య రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అదుపు తప్పి, అస్థిరమైన అప్పులను వివరిస్తూ విడుదల చేసిన నాలుగు శ్వేతపత్రాలను అమిత్ షాకు వివరించానని చంద్రబాబు తెలిపారు. ప్రజలు రాష్ట్రంలో ఎన్‌డిఎకు అనుకూలంగా తీర్పునిచ్చారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రాష్ట్రాన్ని గాడిలో పెడతాయని ట్వీట్ చేశారు.

పర్యటనలో సిఎం చంద్రబాబుతోపాటు రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కేంద్ర మంత్రులు కె రామ్మోహన్‌నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపిలు లావు శ్రీకృష్ణదేవరాయలు, కేశినేని చిన్ని తదితరులు ఉన్నారు. కాగా.. జన్‌పథ్ నివాసంలో చంద్రబాబును బిజెపి ఎంపి సిఎం రమేష్ కలిశారు. అనంతరం చంద్రబాబు తన పర్యటన ముగించుకుని విజయవాడకు చేరుకున్నారు.


7 శాతంగా జిడిపి : ఎడిబి అంచనా

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత జిడిపి 7 శాతంగా నమోదయ్యే అవకాశాలున్నాయని ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎడిబి) అంచనా వేసింది. సాధారణం కంటే అధిక వర్షపాతం ఉండొచ్చన్న అంచనాలతో వ్యవసాయ రంగం పుంజుకోవచ్చని పేర్కొంది. పెట్టుబడులకు డిమాండ్ పెరగొచ్చని తెలిపింది. వచ్చే 2025–26లో 7.2 శాతం వృద్ధి ఉండొచ్చని పేర్కొంది. ఇటీవల అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ వృద్ధి రేటు అంచనాలను 6.8 శాతం నుంచి 7 శాతానికి పెంచిన విషయం తెలిసిందే. గత నెల ఆర్‌బిఐ కూడా తన అంచనాలను 7 నుంచి 7.2 శాతానికి చేర్చింది.

'సర్దార్ 2' ఫైట్‌మాస్టర్ మృతి

కార్తీ హీరోగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'సర్దార్ 2'. ఈ సినిమాలో ఓ భారీ ఫైట్ సీన్ షూట్ చేస్తున్న క్రమంలో ప్రమాదం జరిగింది. మిషన్ కంబోడియా నేపథ్యంలో సాగే సర్దార్ 2 షూటింగ్ ఇటీవలే చెన్నైలో ప్రారంభమైన విషయం తెలిసిందే. ఈ సినిమాకు సంబంధించిన ఒక ఫైట్ సీన్‌ను తెరకెక్కిస్తున్న సమయంలో సెట్స్‌లో ప్రమాదం జరిగింది. ఫైట్‌మాస్టర్ ఎజుమలై సుమారు 20 అడుగుల ఎత్తు నుంచి కిందపడి మరణించాడు. ఎక్కువ ఎత్తు నుంచి కిందపడటంతో ఆయన ఛాతీ భాగంలో తీవ్ర గాయమైంది. ఊపిరి తిత్తుల్లో రక్తస్రావం కావడం వల్లే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలోనే మరో ఇద్దరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.

'భారతీయుడు-2' నుంచి 12 నిముషాలు తొలగింపు



తమిళ్ హీరో కమల్‌హాసన్, డైరెక్టర్ శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'భారతీయుడు–2' సినిమాలో కొన్ని మార్పులు చేసినట్లు మేకర్లు ప్రకటించారు.ప్రేక్షకుల నుంచి వచ్చిన రెస్పాన్స్‌తో సినిమాలోని 12 నిముషాలను ట్రిమ్ చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ట్రిమ్ చేసిన అనంతరం ఎడిషన్‌ను థియేటర్లలో చూడొచ్చునని వెల్లడించారు. ఈ సినిమా ఈనెల 12న విడుదలైన విషయం తెలిసిందే.

రేపటినుంచి మహిళల ఆసియాకప్




తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో భారత్ ఢీ

ధంబుల్లా(శ్రీలంక): మహిళల ఆసియాకప్‌కు రంగం సిద్ధమైంది. 9వ ఆసియాకప్‌కు శ్రీలంక ఆతిథ్యమిస్తోంది. మొత్తం 8జట్ల మధ్య జరిగే 2024 మహిళల ఆసియాకప్ శుక్రవారం నుంచి ప్రారంభం కానుంది. శ్రీలంక ఆతిథ్యమిస్తోన్న ఈ టోర్నమెంట్‌లో దంబుల్లా వేదికగా మొత్తం మ్యాచ్‌లు జరగనున్నాయి. గ్రూప్–ఎలో భారత్‌తోపాటు పాకిస్తాన్, యుఎఇ, నేపాల్... గ్రూప్–బిలో శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థాయ్‌లాండ్ జట్లు ఉన్నాయి. గ్రూప్ లీగ్ దశలో ఒక్కో జట్టు మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ చొప్పున ఆడనుంది. మూడు లీగ్ మ్యాచ్‌లు ముగిసిన తర్వాత ప్రతి గ్రూప్ టాప్–2 జట్లు సెమీస్‌కు చేరనున్నాయి. గ్రూప్–ఎలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్–బిలో రెండోస్థానంలో నిలిచి జట్టుతో, గ్రూప్–బిలో టాప్‌లో నిలిచిన జట్టు గ్రూప్–ఎలో రెండోస్థానంలో నిలిచిన జట్టుతో తలపడనున్నాయి. 2022లో బంగ్లాదేశ్ వేదికగా జరిగిన చివరి ఆసియాకప్‌లో భారతజట్టు విజేతగా నిలిచింది. ఇప్పటి వరకు 8సార్లు మహిళల ఆసియాకప్ టోర్నీ జరగ్గా భారత్ ఏకంగా 7సార్లు విజేతగా నిలిచింది. 2018లో బంగ్లాదేశ్ ఫైనల్లో భారత్‌ను చిత్తుచేసి తొలిసారిగా విజేతగా నిలువగా.. భారత్ రన్నరప్‌తో సరిపుచ్చుకుంది.

గ్రూప్–ఎ: ఇండియా, పాకిస్తాన్, యుఎఇ, నేపాల్
గ్రూప్–బి: శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, థాయ్‌లాండ్

షెడ్యూల్...

19(శుక్ర)	నేపాల్ × యుఎఇ	మ.2.00గం||
	ఇండియా × పాకిస్తాన్	రా.7.00గం||
20(శని)	మలేషియా × థాయ్‌లాండ్	మ.2.00గం||
	శ్రీలంక × బంగ్లాదేశ్	రా.7.00గం||
21(ఆది)	ఇండియా × యుఎఇ	మ.2.00గం||
	నేపాల్ × పాకిస్తాన్	రా.7.00గం||
22(సోమ)	శ్రీలంక × మలేషియా	మ.2.00గం||
	బంగ్లాదేశ్ × థాయ్‌లాండ్	రా.7.00గం||
23(మంగళ)	పాకిస్తాన్ × యుఎఇ	మ.2.00గం||
	ఇండియా × నేపాల్	రా.7.00గం||
24(బుధ)	బంగ్లాదేశ్ × మలేషియా	మ.2.00గం||
	శ్రీలంక × థాయ్‌లాండ్	రా.7.00గం|||
26(శుక్ర)	సెమీఫైనల్–1	మ.2.00గం||
	సెమీఫైనల్–2	రా.7.00గం||
28(ఆది)	ఫైనల్	రా.7.00గం||



117మంది అథ్లెట్లకు 140మంది సహాయ సిబ్బంది

పారిస్ ఒలింపిక్స్‌కు భారత అథ్లెట్లు పయనం

అర్హత సాధించినా మహిళా షాట్‌పుటర్ అభా కథువాకు నిరాశే

పారిస్: పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొనే 117మంది భారత అథ్లెట్లకు 140మంది సహాయ సిబ్బంది వెళ్తున్నారు. ఆ జాబితాకు కేంద్ర ప్రభుత్వమూ ఆమోదం తెలిపింది. గత ఒలింపిక్స్‌తో పోల్చిచూస్తే ఈసారి అత్యధిక పతకాలే క లక్ష్యంగా భారత అథ్లెట్ల బృందం బుధవారం పారిస్‌కు బయల్దేరింది. న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సభకు భారత ఒలింపిక్ సమాఖ్య(ఐఓఏ) అధ్యక్షురాలు పిటి ఉష, ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత రికార్డును బ్రేక్ చేయాలని ఆకాంక్షించారు. ఇక ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా ఒలింపిక్స్‌కు అర్హత సాధించిన మహిళా షాట్ పుటర్ అబా కథువా పేరును ఈ జాబితా నుంచి తొలగించారు. ఆమె పేరు లేకపోవడంపై సర్వత్రా చర్చ నడుస్తోంది. 2021 టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాపైనే అందరి దృష్టి నెలకొంది. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలోనూ భారత అథ్లెట్లు రాణిస్తుండడంతో... పారిస్ ఒలింపిక్స్‌లో మరికొన్ని క్రీడాంశాల్లో పతకాలపై ఆశలు చిగురించాయి.

ఆరో స్థానానికి ఎగబాకిన యశస్వి

- సూర్యకుమార్‌కు 2వ ర్యాంక్
- ఐసిసి టి20 ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) తాజా ర్యాంకింగ్స్‌లో భారత బ్యాటర్లు సూర్యకుమార్ యాదవ్, యశస్వి జైస్వాల్ సత్తా చాటారు. ఐసిసి బుధవారం విడుదల చేసిన టి20 ర్యాంకింగ్స్‌లో మిస్టర్ 360 డిగ్రీస్ సూర్యకుమార్ యాదవ్ తన 2వ ర్యాంక్‌ను నిలబెట్టుకోగా.. యశస్వి జైస్వాల్ నాలుగు స్థానాలు మెరుగుపర్చుకుని ఆరో స్థానానికి ఎగబాకాడు. ఇక శుభ్‌మన్ గిల్ ఏకంగా 36 స్థానాలు మెరుగుపర్చుకుని 37వ స్థానంలో నిలిచాడు. గత నెలలో రెండో స్థానానికి పడిపోయిన సూర్యకుమార్.. ఇటీవల జింబాబ్వేతో సిరీస్ ఆడనప్పటికీ రెండో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. ఇంగ్లండ్ ఆటగాడు ఫిలిప్ సాల్ట్ ఓ స్థానం మెరుగుపర్చుకుని మూడో స్థానానికి చేరాడు. ఆస్ట్రేలియా విధ్వంసం ట్రెవిస్ హెడ్ అగ్రస్థానాన్ని నిలబెట్టుకోగా.. పాకిస్తాన్ ఆటగాళ్లు బాబర్ ఆజమ్, మహ్మద్ రిజ్వాన్ నాలుగు, ఐదు స్థానాల్లో కొనసాగుతున్నారు. ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ ఏడు, టీమిండియా ప్లేయర్ రుతురాజ్ గైక్వాడ్ ఎనిమిది, విండీస్ ఓపెనర్లు బ్రాండన్ కింగ్, జాన్సన్ ఛార్లెస్ తొమ్మిది, పది స్థానాల్లో నిలిచారు. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఆదిల్ రషీద్, నోర్జే, హసరంగ, రషీద్ ఖాన్, హాజిల్‌వుడ్, అకీల్ హొసేన్, ఆడమ్ జంపా, ఫజల్ హక్ ఫారూఖీ, మహీశ్ తీక్షణ టాప్–10లో ఉన్నారు. భారత బౌలర్లలో టాప్–10లో ఎవరూ లేకపోగా.. అక్షర్ పటేల్ నాలుగు స్థానాలు దిగజారి 13కు.. రవి బిష్ణోయ్ నాలుగు స్థానాలు దిగజారి 19కి, జస్ప్రీత్ బుమ్రా ఏడు స్థానాలు దిగజారి 21వ స్థానానికి పడిపోయారు. ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో హార్దిక్ పాండ్యా నాలుగు స్థానాలు దిగజారి ఆరో స్థానానికి పడిపోగా.. హసరంగ అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68